

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 24-06-2026 | సంపుటి - 29 | సంచిక -32 | రూ : 4 | పేజీలు: 8


## బాసర జ్ఞాన సరస్వతీ
## ఆలయంలో చోరీ



- మహంకాళీ అమ్మవారి వెండి కిరీటంతో పాటు హుండీ అపహరణ
- సోమవారం రాత్రి జరిగిన ఘటన, మంగళవారం ఉదయం వెలుగులోకి
- సీసీటీవీ ఫుటేజ్‌లో ఇద్దరు ముసుగు

బాసర : తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర జ్ఞాన సరస్వతి ఆలయ ప్రాంగణంలో భారీ చోరీ జరిగింది. సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ఆలయ సముదాయంలోని మహాకాళి అమ్మవారి ఆలయంలోకి చొరబడి, వెండి కిరీటంతో పాటు హుండీని ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మంగళవారం ఉదయం వెలుగులోకి రావడంతో భక్తులు, అధికారులు దిగ్భ్రాంతికి గురయ్యారు. మంగళవారం ఉదయం నిత్య తరువాయి 2లో



# మెట్రో విస్తరణపై ముందడుగు

- కేంద్ర మంత్రులు మనోహర్ ఖట్టర్,
- అశ్వినీ వైష్ణవ్, కిషన్ రెడ్డితో సీఎం రేవంత్ రెడ్డి చర్చలు సఫలం
- ఫేజ్–I వాల్యూయేషన్.. ఫేజ్–II విస్తరణకు కన్సల్టెంట్‌గా ఎస్‌బీఐసీఏపీఎస్
- కన్సల్టెంట్ రిపోర్ట్ ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ
- సమన్వయ సభ్యులుగా కేంద్ర ప్రభుత్వ అధికారి, రాష్ట్ర ఎంఏయూడీ స్పెషల్ సెక్రెటరీ

న్యూఢిల్లీ బ్యూరో : హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణ అంశంలో కీలక ముందడుగు పడింది. హైదరాబాద్ మెట్రో ఫేజ్ -I స్వాధీనం, ఫేజ్ -II విస్తరణపై ఉన్న ఆటంకాలు తొలగనున్నాయి. కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్వినీ వైష్ణవ్, కిషన్ రెడ్డితో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జరిపిన రెండ్రోజుల చర్చలు ఫలప్రదమైనట్టు సీఎంఓ ఒక ప్రకటనలో తరువాయి 2లో

## కాంగ్రెస్ అవినీతి పై
## పోరాటం చేస్తాం

- హైదరాబాద్ మెట్రో ట్రైన్ పేరుతో రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి డ్రామాలు
- రూ.30 వేల కోట్ల మెట్రో రైల్ ఆస్తులపై సీఎం కన్ను : కేటీఆర్



మియాపూర్ : కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిపై పోరాటం చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి పార్టీ నియోజవకర్గ స్థాయి కార్యకర్తల సమావేశం మియాపూర్‌లోని నేరన్ గార్డెన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ మెట్రో రైల్ పేరుతో రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.30 వేల కోట్ల మెట్రో రైల్ ఆస్తులపై రేవంత్ రెడ్డి కన్ను పడిందన్నారు. బీఆర్ఎస్ తరపున కార్యకర్తల కష్టంతో గెలిచిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ తన స్వార్థ ప్రయోజనాల కోసం తరువాయి 2లో

## వడ్డెరలకు ఇచ్చిన హామీని నెరవేర్చాం



- క్వారీల్లో వడ్డెరలకు 33 శాతం కేటాయిస్తామని యువగళం సమయంలో లోకేశ్ హామీ
- వడ్డెరలకు 33 శాతం కేటాయిస్తూ జీవో జారీ చేసిన ప్రభుత్వం
- తమది చేతల ప్రభుత్వం అన్న లోకేశ్

2లో

## దేశ రాజధాని ఢిల్లీని ముంచెత్తిన
## దుమ్ము తుపాను

- గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు
- పలు ప్రాంతాలకు ఐఎండీ ఆరెంజ్, రెడ్ అలర్ట్ జారీ
- ఎండవేడి నుంచి ప్రజలకు తాత్కాలిక ఉపశమనం
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

2లో





## ఆంధ్రప్రదేశ్ 'జొన్నగిరి' స్వర్ణ క్షేత్రం
# నేడు ప్రారంభించనున్న సీఎం

- కర్నూలు జిల్లా జొన్నగిరిలో అతిపెద్ద గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభం
- సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్లాంట్ ప్రారంభోత్సవం, రెండో యూనిట్‌కు శంకుస్థాపన
- రూ.405 కోట్లతో జియో మైసూర్, డెక్కన్ గోల్డ్ మైన్స్ సంయుక్త ప్రాజెక్ట్
- తొలి దశలో 400 కిలోలు, భవిష్యత్తులో 2 టన్నుల బంగారం ఉత్పత్తి లక్ష్యం
- ఉత్పత్తి విలువలో 4 శాతం రాయల్టీ రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం

2లో

## పద్మశ్రీ అందుకున్న
## రాజేంద్రప్రసాద్, మురళీమోహన్

- రాష్ట్రపతి భవన్ వేదికగా అట్టహాసంగా పద్మ పురస్కారాల ప్రదానం
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్న రాజేంద్రప్రసాద్, మురళీమోహన్
- కార్యక్రమానికి హాజరైన మోదీ, అమిత్ షా

2లో





## హర్మూజ్ జలసంధిలో రికార్డు స్థాయిలో ఆయిల్ రవాణా

- హర్మూజ్ జలసంధిలో ఒక్కరోజే 19 మిలియన్ బ్యారెళ్ల ఆయిల్ రవాణా
- ఇరాన్‌తో ఒప్పందం వల్లే ఇది సాధ్యమైందని ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్
- ఈ పరిణామంతో ప్రపంచవ్యాప్తంగా తగ్గుముఖం పడుతున్న చమురు ధరలు

2లో

## లక్నో అగ్నిప్రమాదం
## 2016 కూల్చివేత ఉత్తర్వుల రద్దు!

- అగ్నిప్రమాదంలో 15 మంది సజీవ దహనం
- పదేళ్ల క్రితం ఇదే భవనం కూల్చివేతకు లక్నో డెవలప్‌మెంట్ అథారిటీ ఆదేశాలు



2లో

# మెట్రో విస్తరణపై ముందడుగు

న్యూఢిల్లీ బ్యూరో : హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణ అంశంలో కీలక ముందడుగు పడింది. హైదరాబాద్ మెట్రో ఫేజ్-I స్వాధీనం, ఫేజ్-II విస్తరణపై ఉన్న ఆటంకాలు తొలగనున్నాయి. కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్వినీ వైష్ణవ్, కిషన్ రెడ్డితో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జరిపిన రెండ్రోజుల చర్చలు ఫలప్రదమైనట్టు సీఎంఓ ఒక ప్రకటనలో పేర్కొంది. మంగళవారం నాడిక్కడ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. కృష్ణ మీనన్ మార్గ్ లోని ఖట్టర్ నివాసంలో జరిగిన ఈ భేటీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. దాదాపు అరగంట పాటు సాగిన ఈ సమావేశంలో హైదరాబాద్ మెట్రో ఫేజ్-I వాల్యూయేషన్, ఫేజ్-I స్వాధీనానికి అవసరమైన రుణ సేకరణ, ఇతర అంశాలపై కీలకంగా చర్చించారు. అలాగే మెట్రో ఫేజ్ -2 పై చర్చలు జరిపారు. ఈ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలు, ఆలోచనలను సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రుల ముందుం చారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో కేంద్ర సహకారం అందించాలని కోరారు. ముఖ్యంగా ఫేజ్ 1 కు నిధుల సేకరణ, ఫేజ్ -2 విస్తరణ విషయంలో అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

*** సీఎం, కేంద్ర మంత్రుల మధ్య ఏకాభిప్రాయం**

వరుసగా జరిగిన ఈ సమావేశాల్లో సీఎం, కేంద్ర మంత్రుల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. ప్రధానంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్-I వాల్యూయేషన్, ఫేజ్-I స్వాధీనానికి అవసరమైన రుణ సేకరణ, రుణ సంస్థ ఎంపిక, మెట్రో ఫేజ్-II విస్తరణ, నిర్మాణ వ్యయం, అందుకు అవసరమైన రుణ సేకరణ అంశాలను అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ ను నియమించాలని నిర్ణయించారు. కన్సల్టెంట్‌గా ఎస్బీఐసీఏపీఎస్ ని ఎంపిక చేశారు. మెట్రో ఫేజ్-I వాల్యూయేషన్... ఫేజ్ II విస్తరణ.. ఇతర అంశాలపై ఎస్బీఐసీఏపీఎస్ సమగ్రంగా అధ్యయనం చేయనుంది. ఈ కన్సల్టెంట్ సంస్థ ఇచ్చే రిపోర్ట్ ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ చేపట్టేందుకు అంగీకారం తెలిపారు. కన్సల్టెంట్ అధ్యయనం సమయంలో సమన్వయానికి ప్రతినిధులుగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక అధికారి, రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి (ఎంఏ &యూడీ) శాఖ స్పెషల్ సెక్రెటరీ ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ అధికారులు ఇద్దరు సమన్వయం చేసు కుంటూ ఈ ప్రక్రియ వేగంగా సాగేందుకు కృషి చేస్తారని సీఎంఓ తెలిపింది. కాగా హైదరాబాద్ డెవలప్‌మెంట్‌లో ప్రధాన భూమిక పోషించనున్న హైదరాబాద్ మెట్రో విస్తరణ లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో రెండ్రోజులు సమావేశమయ్యారు. తొలుత సోమవారం రాత్రి ఢిల్లీలోని రైల్వే భవన లో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో సుదీర్ఘంగా చర్చించారు. దాదాపు రెండు గంటల పాటు సాగిన ఈ భేటీలో మెట్రో ఫేజ్ -1 కు ఇండియన్ రైల్వేఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్సీ) లోన్ పై చర్చించారు. అలాగే మెట్రో సెకండ్ ఫేజ్ అనుమ తుల వ్యవహారంలో అడ్డంకులపై చర్చిం చారు. అయితే ఈ భేటీలో మెట్రో విస్తరణ, నిధుల సమ కూర్పుపై సానుకూలత వచ్చినట్లు భేటీ అనంతరం సీఎం వెల్లడించారు. ఈ విషయంలో మరింత ముందుకు వెళ్లే అంశంపై... నోడల్ ఆఫీసర్‌గా ఉన్న కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రితో చర్చించాలని ఈ మీటింగ్ లో నిర్ణయించారు. ఈ మేరకు కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో కేంద్ర మంత్రులు ఫోన్ లో మాట్లాడారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ, అనుమతులు, నిధుల సేకరణ, ఇతర అంశాలపై చర్చించేందుకు కేంద్ర మంత్రి ఖట్టర్ తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

## ఏసీబీ అదుపులో నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి

నిజామాబాద్: నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి నివాసంలో ఇవాళ ఉదయం నుంచి ఏసీబీ సోదాలు కొనసాగుతున్నాయి. ఆదాయానికి మించి ఆస్తుల వ్యవహారంలో హైదరాబాద్ మచ్చబొల్లారం, నిజామాబాద్ ప్రగతినగర్‌లోని ఆయన నివాసాలతో పాటు సూపరింటెండెంట్ కార్యాలయం, ఆయన బంధువుల ఇళ్లల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. గత ఆరేళ్లుగా మల్లారెడ్డి నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల ఆయనపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఈనేపథ్యంలో ఏసీబీ అధికారులు మల్లారెడ్డిపై దృష్టిసారించారు. ప్రగతి నగరంలోని ఆయన



నివాసంలో కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్న అధికారులు.. మల్లారెడ్డిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్ తరలించినట్టు సమాచారం.

## కాంగ్రెస్ అవినీతి పై పోరాటం చేస్తాం

మియాపూర్ : కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిపై పోరాటం చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి పార్టీ నియోజవకర్గ స్థాయి కార్యకర్తల సమావేశం మియాపూర్‌లోని నేరన్ గార్డెన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ మెట్రో రైల్ పేరుతో రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.30 వేల కోట్ల మెట్రో రైల్ ఆస్తులపై రేవంత్ రెడ్డి కన్ను పడిందన్నారు. బీఆర్ఎస్ తరపున కార్యకర్తల కష్టంతో గెలిచిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ తన స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌లోకి మారారని ఆరోపించారు. ఆయననే గతంలో పదేండ్ల బీఆర్ఎస్ కాలంలో ఒక్క శేరిలింగంపల్లి నియోజకవర్గానికి రూ.9,500 కోట్లతో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులతో ఒక ప్రగతి నివేదికను విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు. మరి ఈ రెండేండ్లలో ఎన్ని డబ్బులు నియోజకవర్గానికి తెచ్చారో గాంధీ చెప్పాలని డిమాండ్ చేశారు. అబద్ధపు హామీలతో రేవంత్ రెడ్డి గద్దెనెక్కాడని ఆరోపించారు. తులం బంగారం, మహిళలకు రూ.2500 ఇవన్నీ ఎక్కడా అని ప్రశ్నించారు. కేసీఆర్ మళ్ళీ ఎప్పుడు అధికారంలోకి వస్తారా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో ఆరచకాలు సృష్టిస్తోందన్నారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ పైన కార్యకర్తలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, వివేక్, జగదీష్ రెడ్డి, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు, సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, శేరిలింగంపల్లి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వడ్డెరలకు ఇచ్చిన హామీని నెరవేర్చాం

వడ్డెర సామాజికవర్గానికి క్వారీల్లో 33 శాతం వాటా కేటాయించాలని యువగళం పాదయాత్ర సమయంలో నారా లోకేశ్ ఇచ్చిన హామీని నెరవేర్చుతూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వడ్డెరలకు 33 శాతం వాటా కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నం. 126 జారీ చేసింది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, "యువగళం పాదయాత్రలో ప్రజలు పడుతున్న కష్టాలను ప్రత్యక్షంగా చూశాను. ఆ సమయంలో వడ్డెర సోదరులు తమ కులవృత్తిని కొనసాగించడానికి క్వారీలు కేటాయించాలని నన్ను కోరారు. ఆనాడు ఇచ్చిన హామీ మేరకు ఈ జీవో జారీ చేశాం" అని తెలిపారు. తమ ప్రభుత్వం చేతల ప్రభుత్వం అని చెప్పారు. "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని లోకేశ్ వ్యాఖ్యానించారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నామని అన్నారు. మరోవైపు, కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై వడ్డెర సంఘాల నేతలు, కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ కులవృత్తికి ప్రభుత్వం గుర్తింపు ఇచ్చినందుకు వారు మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## పద్మశ్రీ అందుకున్న రాజేంద్రప్రసాద్, మురళీమోహన్

ఢిల్లీ :మన తెలుగు చలనచిత్ర పరిశ్రమకు జాతీయ స్థాయిలో మరోసారి గర్వించదగ్గ గౌరవం దక్కింది. దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ వేదికగా పద్మ పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవ కార్యక్రమం ఈరోజు అత్యంత వైభవంగా జరిగింది. వివిధ రంగాల్లో దేశానికి విశేష సేవలు అందించిన ప్రముఖులకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ అత్యున్నత పౌర పురస్కారాలను అందజేశారు. ఈ విడతలో మొత్తం 47 మందికి పద్మశ్రీ అవార్డులు ప్రదానం చేయగా.. అందులో మన టాలీవుడ్ లెజెండ్స్ ఉండటం విశేషం. నాలుగు దశాబ్దాలుగా వందలాది చిత్రాల్లో వైవిధ్యమైన నటనతో,



హాస్యంతో కోట్లాది మంది తెలుగు ప్రేక్షకులను అలరించిన 'నటకిరీటి' రాజేంద్రప్రసాద్..

కళారంగానికి చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని స్వీకరించారు. నటుడిగా, నిర్మాతగా 'జయభేరి' బ్యానర్‌పై అద్భుతమైన చిత్రాలు నిర్మించడమే కాకుండా, 'మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్' అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన సీనియర్ నటుడు మురళీమోహన్ కూడా రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రధానమంత్రి మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షాతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## దేశ రాజధాని ఢిల్లీని ముంచెత్తిన దుమ్ము తుపాను

ఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీతో పాటు పరిసర ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మంగళవారం మధ్యాహ్నం గురుగ్రామ్ సహా ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలోని పలు ప్రాంతాలను తీవ్రమైన దుమ్ము తుపాను ముంచెత్తింది. దీని ప్రభావంతో దట్టమైన ధూళి మేఘాలు కమ్ముకోవడమే కాకుండా, బలమైన ఈదురుగాలులు వీచాయి. పలుచోట్ల ఉరుములతో కూడిన వర్షం కురవడంతో ఎండ తీవ్రత నుంచి ప్రజలకు తాత్కాలిక ఉపశమనం లభించింది. ఈ దుమ్ము తుపాను కారణంగా పలు ప్రాంతాల్లో ఎదురుగా ఉన్నవి కూడా కనిపించలేదు. గురుగ్రామ్‌లో ప్రారంభమైన ఈ తుపాను క్రమంగా ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్ పరిసర ప్రాంతాలకు విస్తరించింది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించిన వివరాల ప్రకారం, కొన్ని ప్రాంతాల్లో గాలి వేగం గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వరకు నమోదైంది. దీని ఫలితంగా వ్యవసాయ భూముల వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రత 39.8 డిగ్రీల సెల్సియస్ నుంచి ఏకంగా 28.8 డిగ్రీలకు పడిపోయింది. ఈ వాతావరణ మార్పులకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఐఎండీ ఢిల్లీఎన్‌సీఆర్‌కు ఆరెంజ్, రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాబోయే కొద్ది గంటల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 80-100 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.

## హర్మూజ్ జలసంధిలో రికార్డు స్థాయిలో ఆయిల్ రవాణా

అమెరికా, ఇరాన్‌ల మధ్య ఇటీవల కుదిరిన ఒప్పందం ఆశించిన సత్ఫలితాలనిస్తోందని, హర్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణా తిరిగి భారీగా పుంజుకుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. సోమవారం ఒక్కరోజే ఈ జలసంధి గుండా 1.9 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా జరిగిందని, ఇది ఒక సంచలనాత్మక రికార్డు అని ఆయన ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. "నిన్న హర్మూజ్ జలసంధి నుంచి 19 మిలియన్ బ్యారెళ్ల చమురు సరఫరా అయింది. ఇది ఒక సరికొత్త రికార్డు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ప్రపంచం ఇప్పుడు మరింత సురక్షితమైన ప్రదేశంగా మారింది" అని ఆయన పేర్కొన్నారు. ఈ సానుకూల పరిణామంతో అంతర్జాతీయ విపణిలో ముడి చమురు ధరలు తగ్గాయి. నిరసనలు, తప్పుడు ప్రచారాల ద్వారా అమెరికా విజయాన్ని తక్కువ చేసే ప్రయత్నాలు జరిగినప్పటికీ, భవిష్యత్తులో అత్యున్నత స్థాయి అణు తనిఖీలకు ఇరాన్ అంగీకరించిందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యకలాపాలపై పారదర్శకతకు ఇది భరోసా ఇస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒకవేళ ఇరాన్ ఈ నిబంధనలకు కట్టుబడి ఉండకపోతే, తదుపరి చర్చలకు తావుండదని హెచ్చరించారు. ఇరాన్ చేసిన కొన్ని ప్రతిపాదనల ప్రాతిపదికన, ఎలాంటి దిగ్బంధనం లేకుండా హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు తాను అంగీకరించినట్లు ట్రంప్ వివరించారు. ఒకవేళ తిరిగి దిగ్బంధనాన్ని విధిస్తే నౌకల రాకపోకలు ఎక్కడికక్కడే నిలిచిపోతాయని, అయితే ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో అటువంటి అవసరం రాకపోవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఒప్పందంలో భాగంగా అమెరికా విడుదల చేసే నిధులను ఇరాన్ కేవలం ఆహారం, వైద్య సామగ్రి వంటి అత్యవసరాల కోసమే వినియోగించగలదని, వాటిని కూడా కేవలం అమెరికా నుంచే కొనుగోలు చేయాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ సముద్ర వాణిజ్యంలో దాదాపు 20 శాతం చమురు రవాణా సౌదీ అరేబియా, యూఏఈ, ఇరాక్ వంటి దేశాల నుంచి హర్మూజ్ జలసంధి ద్వారానే సాగుతుంది. గత కొంతకాలంగా ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలు, దిగ్బంధనాల కారణంగా ఈ మార్గంలో చమురు సరఫరాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడి ధరలు పెరిగాయి. అయితే, తాజా ఒప్పందంలో భాగంగా అణు తనిఖీలకు ఇరాన్ సమ్మతించడంతో ప్రాంతీయ ఉద్రిక్తతలు సద్దుమణిగాయి.

## లక్నో అగ్నిప్రమాదం: 2016 కూల్చివేత ఉత్తర్వుల రద్దు!




ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో సంభవించిన ఘోర అగ్నిప్రమాదంలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. అలీగంజ్‌లోని ఒక మూడంతస్తుల వాణిజ్య భవనంలో సోమవారం మధ్యాహ్నం మంటలు చెలరేగడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. మృతుల్లో అత్యధికులు యానిమేషన్ శిక్షణా కేంద్రానికి హాజరైన విద్యార్థులే కావడం గమనార్హం. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంతో భవన నిర్మాణం నిబంధనలు ఉల్లంఘనలు మరియు నియంత్రణ వైఫల్యాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. అక్రమ నిర్మాణం కారణంగా ఈ భవనాన్ని కూల్చివేయాలని 2016 మే 10న లక్నో డెవలప్‌మెంట్ అథారిటీ ఆదేశాలు జారీ చేసింది. అయితే, కేవలం రెండు నెలల వ్యవధిలోనే, అంటే అదే ఏడాది జులై 5న ఆ ఆదేశాలను అధికారులు రద్దు చేయడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సరైన విచారణ జరపకుండానే నోటీసులు ఇచ్చారని, భవన నిర్మాణం నిబంధనలకు అనుగుణంగానే జరిగిందని అప్పటి యాజమాన్యం ప్రభుత్వ ఉత్తర్వులను సవాలు చేయడంతో, ఆ కూల్చివేత ఆదేశాలు రద్దయ్యాయి. కాగా, 1980వ సంవత్సరం నుంచి ఈ స్థలం పలువురి చేతులు మారుతూ వచ్చిందని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

## బాసర జ్ఞాన సరస్వతీ ఆలయంలో చోరీ: కిరీటం, హుండీ మాయం

బాసర : తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర జ్ఞాన సరస్వతి ఆలయ ప్రాంగణంలో భారీ చోరీ జరిగింది. సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ఆలయ సముదాయంలోని మహాకాళి అమ్మవారి ఆలయంలోకి చొరబడి, వెండి కిరీటంతో పాటు హుండీని ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మంగళవారం ఉదయం వెలుగులోకి రావడంతో భక్తులు, అధికారులు దిగ్భ్రాంతికి గురయ్యారు. మంగళవారం ఉదయం నిత్య పూజల కోసం వచ్చిన అర్చకులు ఆలయ ద్వారాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఆలయ ప్రాంగణంలోని పై అంతస్తులో ఉన్న మహాకాళి అమ్మవారి ఆలయం గేటును పగలగొట్టిన దొంగలు, సుమారు 1.5 కిలోల బరువున్న వెండి కిరీటాన్ని అపహరించారు. అనంతరం హుండీని పగలగొట్టి అందులోని నగదును దోచుకుని, ఖాళీ హుండీని సమీపంలోనే పడేశారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిళ, స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆలయాన్ని



సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా, ఇద్దరు ముసుగు ధరించిన వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించినట్లు గుర్తించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సాయంతో పోలీసులు ఆధారాలను సేకరిస్తున్నారు. గోదావరి నది తీరాన కొలువుదీరిన ఈ ఆలయాన్ని భక్తులు 'దక్షిణ గంగ'గా పిలుచుకుంటారు. కురుక్షేత్ర యుద్ధం ముగిసిన అనంతరం వేదవ్యాస మహర్షి ఇక్కడ సరస్వతి, మహాలక్ష్మి, మహాకాళి విగ్రహాలను ప్రతిష్ఠించారని పురాణ గాథలు చెబుతున్నాయి. ఇటీవల ఏప్రిల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. 225 కోట్లతో ఆలయ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేసిన తరుణంలో, ఈ భారీ చోరీ జరగడం భద్రతా వైఫల్యాలపై పలు అనుమానాలను రేకెత్తిస్తోంది. ఈ ఘటన నేపథ్యంలో ఆలయంలో భక్తుల కానుకల లెక్కింపు ప్రక్రియను అధికారులు తాత్కాలికంగా వాయిదా వేశారు. పోలీసులు కేసు నమోదు చేసి సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తును ముమ్మరం చేశారు. నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, ఇప్పటివరకు ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని వెల్లడించారు. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా కోయిలకుంట్ల శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలోనూ హుండీ చోరీ జరగడం గమనార్హం.

# రైతు సంరక్షణ కేంద్రంలో విత్తన మేళా – పంటల సాగుపై అవగాహన సదస్సు




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి పంట మార్పిడి ద్వారా అధిక దిగుబడులు సాధించాలని మేయర్ బుర్ర చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం రైతు సంరక్షణ కేంద్రంలో నిర్వహించిన విత్తన మేళా - పంటల సాగుపై అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు . రైతులకు పంటల ఎంపిక, పంట మార్పిడి, నాణ్యమైన విత్తనాల వినియోగం, నేల ఆరోగ్య పరిరక్షణ, ఎరువుల సమతుల్య వినియోగం, ఆధునిక సాగు పద్ధతులపై నిపుణులు అవగాహన కల్పించారరు ఒకే పంటను పదేపదే సాగు చేయడం వల్ల నేల సారవంతత తగ్గిపోతుందని, పంట మార్పిడి విధానాన్ని అనుసరించడం ద్వారా భూమి ఆరోగ్యం మెరుగుపడి రైతులకు అధిక లాభాలు చేకూరుతాయని తెలిపారు. రైతులు మార్కెట్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. అగ్రికల్చర్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, ధృవీకరించిన విత్తనాల వినియోగం ద్వారా రైతులు మెరుగైన దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ అనంతరెడ్డి మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగు రైతులకు అదనపు ఆదాయ మార్గంగా నిలుస్తుందని వివరించారు. విత్తన మేళాలో వివిధ రకాల నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ సాంకేతిక పరికరాలు, పంటల సంరక్షణకు సంబంధించిన ప్రదర్శనలు ఏర్పాటు చేసి రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో రైతు. ఏ సి ఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరాజు సంక్షేమ సంఘం అసిస్టెంట్ డైరెక్టర్ గిరి ప్రసాద్, ఆర్టికల్చర్ డైరెక్టర్ అనంతరెడ్డి హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ అనంతరెడ్డి, రెండవ డివిజన్ కార్పొరేటర్ పెరిక యాదయ్య, పి.ఎస్.ఎస్ చైర్మన్ నాగరత్నం రాజు, మూడవ డివిజన్ కార్పొరేటర్ పేర్ల మల్లేశ్వరి అశోక్ చంద్ర, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతు నాయకులు , పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ఎన్‌సీసీ విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన




జనగామ, ప్రజస్ఫూర్తి : అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరి యు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్స వం సందర్భంగా పట్టణంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్. ఐ రతీష్, పోలీసు సిబ్బంది పాల్గొని మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తి గత, కుటుంబ, సామాజిక స్థాయిలో కలిగే దుష్పరిణామాలను వివరించారు. విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించేందు కు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీ లు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతు లు అందజేసి అభినందించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్య కరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీని వాస్, ఎన్‌సీసీ పీ.డీ కళ్యాణి, జువాలజీ ప్రొఫెసర్ అనురాధ తోపాటు అధ్యాప కులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనం.. అధిక దిగుబడికి పునాది

*** జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ, ప్రజస్ఫూర్తి : జిల్లా రైతులు జూన్ 23 నుంచి 30 వ తేదీ వరకు నిర్వహిస్తున్న విత్తన మేళాలను సద్వి నియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. నర్మెట్ట రైతు వేదికలో విత్తన మేళాను ప్రారంభించిన ఆయన, నాణ్యమైన విత్తనమే మంచి పంటకు పునాదని పేర్కొన్నారు.ధ్రువీకరించిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని, బిల్లు లు తప్పని సరిగా తీసుకోవాలని రైతు లకు సూచించారు. వ్యవసాయ సాంకే తిక పరిజ్ఞానం, ఆధునిక సాగు పద్ధతు లు, పంటల యాజమాన్యం, ఎరువుల వినియోగం, పురుగు మందుల నిర్వ హణ వంటి అంశాలపై రైతు వేదికలను శిక్షణా కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమం అనంతరం వన మహోత్స వం లో భాగంగా రైతు వేదిక ప్రాంగణం లో మొక్కలు నాటిన కలెక్టర్, మహిళా రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి నిర్వ హణ,విక్రయాల తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోని, సర్పంచ్ శ్రీధర్ గౌడ్, ఎంపీడీఓ, ఏడీఏ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రంథాలయాలు చదువుతోపాటు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయి

*** జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : పాఠకులతో పాటు, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నల్గొండ జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలో పుస్తకాలు, తాగునీరు, టాయిలెట్లు, ఇతర ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. వై ఫై సౌకర్యం ఉందా అని అడిగారు.ఈ సందర్భంగా పాఠకులు స్పందిస్తూ గ్రంథాలయంలో తమకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు లేవని తెలిపారు.

# బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో భారీ చోరీ

*** ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**



ప్రజాస్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లాలోని బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో భారీ చోరీ జరిగింది. అమ్మవారి ప్రధాన ఆలయం వెనుక ఉన్న మహంకాళి ఆలయ తాళాలు పగులగొట్టి దుండగులు చోరీకి పాల్పడ్డారు.చోరీ జరిగిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీ పవార్ రామారావు పటేల్ గారు, సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్ గార్లు ఆలయాన్ని సందర్శించి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఆలయ అధికారులు, పోలీసు అధికారులతో మాట్లాడి చోరీ వివరాలను తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయాల్లో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు. అలాగే చోరీకి పాల్పడిన దుండగులను త్వరితగతిన గుర్తించి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అనంతరం బాసరలో ఎస్ఐఆర్2026 అవగాహన 2కే రన్ ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్2026) కార్యక్రమంలో భాగంగా బాసర మండల కేంద్రంలో నిర్వహించిన 2కే రన్‌లో ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్, సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్ పాల్గొన్నారు. ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు మరియు ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# రైతులు విత్తన మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

*** జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం జూన్ 23 నుంచి 30వ తేదీ వరకు ప్రతి మండలంలో నిర్వహిస్తున్న విత్తన మేళాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లాలోని మనోహరాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను కలెక్టర్ ప్రారంభించి, విత్తన మేళాలో గల ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన అన్ని రకాల ధ్రువీకరించిన నాణ్యమైన విత్తనాలను ఒకే వేదికపై సరసమైన ధరలకు అందించేందుకు వ్యవసాయ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు. రైతు వేదికలలో నిర్వహిస్తున్న ఈ విత్తన మేళాల్లో సన్న వడ్లు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డిఏపి వంటి ఆధునిక వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయంలో యూరియాను అధిక మోతాదులో వినియోగించడం వల్ల భూసారం దెబ్బతింటుందని, శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువులను వినియోగించాలని రైతులకు సూచించారు. ప్రతి గ్రామంలో రైతులకు అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉండేలా తగిన నిల్వలు ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో సుమారు 4.18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు.గత సంవత్సరంతో పోలిస్తే సుమారు 1 లక్ష మెట్రిక్ టన్నుల అధిక ధాన్యం కొనుగోలు జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో బావయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవ్ కుమార్ సర్పంచ్ అనూష భాస్కర్ యాదవ్, ఏఎంసి చైర్ పర్సన్ కీర్తన విటల్ రెడ్డి, ఏడిఏ టెక్నికల్ వినయ్, ఏ డి ఏ నర్సాపూర్ సంధ్య, మండల వ్యవసాయ అధికారి ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ సమీక్ష సమావేశం



నల్గొండ, ప్రజాస్ఫూర్తి : టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ మంగళవారం నల్గొండ ఎలక్ట్రిసిటీ గెస్ట్ హౌస్‌లో జిల్లా స్థాయి విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నల్గొండ సర్కిల్‌కు సంబంధించిన టీకోడ్ వారీ అంచనాలు, వివిధ అభివృద్ధి పనుల పురోగతి, అమలు పరిస్థితులు మరియు పెండింగ్ అంశాలపై సమగ్రంగా చర్చించారు.కాలిపోయిన , పనిచేయడం నిలిచిపోయిన (స్టక్ అప్) విద్యుత్ మీటర్లను త్వరితగతిన మార్చడం, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించే చర్యలను వేగవంతం చేయాలని సీఎండీ ఆదేశించారు.202324 , 202425 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన పూర్తికాని పనుల పురోగతి, వాటి పూర్తి కోసం అవసరమైన మెటీరియల్, నిధులు మరియు ఇతర అవసరాలపై సమీక్షించారు. అలాగే 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కొత్త అంచనాలు, బడ్జెట్ ఇండెంట్లు మరియు ప్రతిపాదిత పనులపై చర్చించారు. విద్యుత్ మౌలిక వసతుల బలోపేతానికి అవసరమైన కండక్టర్లు, కేబుళ్లు, విద్యుత్ స్తంభాలు, ఇంటర్మీడియట్ పోల్స్ ఏర్పాటు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ ప్లింత్ రైజింగ్ తదితర పనులకు అవసరమైన సామగ్రి అవసరాలను అధికారులు వివరించారు. వర్షాకాల సన్నద్ధత, విద్యుత్ అంతరాయాల నివారణ చర్యలు, ఫీడర్ల నిర్వహణ, ట్రీ ట్రిమ్మింగ్ కార్యక్రమాలు, వ్యవసాయ విద్యుత్ సరఫరా, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు మరియు వినియోగదారుల సేవల మెరుగుదలపై సమగ్రంగా చర్చించారు.వ్యవసాయ రంగానికి నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, మాన్సూన్ కాలంలో విద్యుత్ వ్యవస్థ సజావుగా పనిచేసేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎండీ జితేష్ వి. పాటిల్ సూచించారు.ఈ సమావేశంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్. నరసింహులు, చీఫ్ ఇంజనీర్ (రూరల్ జోన్) బాలస్వామి, ఎస్ఈ (ఆపరేషన్స్) నల్గొండ వెంకటేశ్వర్లు, నల్గొండ సర్కిల్ పరిధిలోని 33 మండలాలు, 5 మున్సిపాలిటీలకు చెందిన డీఈలు, ఏడీఈలు, ఏఈలు, ఏఏఈలు, జేఏఓలు, ఎస్ఏఓలు , ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వైటీపీఎస్ ప్రైవేటీకరణ టెండర్ రద్దుకు నాలుగో రోజు నిరసనలు




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ లోని సీహెచ్పీ, ఎహెచ్పీ విభాగాల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే టెండర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ ఉద్యోగులు టీజీపీఈ జేఏసీ ఆధ్వర్యంలో నాలుగో రోజు కూడా నిరసనలు చేపట్టారు. రూ.255 కోట్ల వ్యయంతో మూడు సంవత్సరాల కాలానికి సీహెచ్పీ, ఎహెచ్పీ విభాగాల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో టీజీపీఈ జేఏసీ ప్రతినిధులు ఇటీవల టీజీ జెన్కో సీఎండీని కలిసి టెండర్‌ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. అయితే యాజమాన్యం నుంచి స్పష్టమైన హామీ లభించలేదని నాయకులు తెలిపారు.దీంతో టెండర్ రద్దు డిమాండ్‌ను మరింత బలంగా వినిపించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టీజీ ట్రాన్స్కో, డిఐఎస్సీఓఎంఎస్, , టీజీ జెన్కో విద్యుత్ కేంద్రాల్లో భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలను బలోపేతం చేయాలని వైటీపీఎస్ లో ప్రైవేటీకరణ చర్యలను ఉపసంహరించుకోవాలని, ఉద్యోగుల భద్రతతో పాటు సంస్థ ప్రయోజనాలను కాపాడాలని వారు డిమాండ్ చేశారు.జై టీజీ జెన్కో- సేవ్ వైటీపీఎస్ " నినాదాలతో ఉద్యోగులు తమ నిరసనను కొనసాగించారు.

# మహారాష్ట్ర అసెంబ్లీలో తిలక్ వర్మ.. ఎందుకంటే!

ముంబై, జూన్ 23: మహారాష్ట్ర అసెంబ్లీలో యువ క్రికెటర్ తిలక్ వర్మ ప్రత్యక్షమై అందర్నీ ఆశ్చర్యపరిచాడు. తిలక్ స్నేహితుడు విక్రమ్ కాకడే నేడు ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమం కోసం మహా అసెంబ్లీకి వచ్చిన తిలక్ వర్మ.. అక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. విక్రమ్ తనకు సోదరుడిలాంటి వారని చెప్పారు. కొత్త ఇన్నింగ్స్ ప్రారంభిస్తున్న మిత్రుడికి శుభాకాంక్షలు తెలిపాడు. సామాజిక సేవలో భాగంగా గతంలో అనేక కార్యక్రమాలు చేపట్టిన విక్రమ్ కాకడే.. కొత్త బాధ్యతల్లో మరింత రాణిస్తారని ఆశాభావం వ్యక్తం చేశాడు.

# గాలి వానతో భూపాలపల్లిలో నష్టం.. బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే గండ్ర



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 9వ, 10వ వార్డుల్లో ఇటీవల కురిసిన గాలి వానతో దెబ్బతిన్న ఇళ్లు, పూరిగుడిసెలు, చెట్లు విరిగి పడిన ప్రాంతాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే, జరిగిన నష్టంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో మాట్లాడి దెబ్బతిన్న ఆస్తులపై సమగ్ర నివేదిక రూపొందించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించిన ఆయన, గాలి వాన కారణంగా ఇంటి పైకప్పులు పూర్తిగా దెబ్బతిన్న అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు పథకం కింద రూ.2 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేయించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో 9వ, 10వ వార్డుల కౌన్సిలర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు సరైన విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించాలి

*** విత్తన మేళాలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**



రేగొండ, ప్రజాస్ఫూర్తి : రైతులు ప్రస్తుత, రానున్న వర్షపాత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచించారు. రేగొండ మండల రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులకు అధిక లాభాలు అందించే సన్న వడ్ల రకాలపై వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. వర్షపాతం అనుకూలంగా ఉన్నప్పటికీ తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై రైతులకు సూచనలు అందించాలని వ్యవసాయ, హార్టికల్చర్ శాఖ అధికారులను ఆదేశించారు.పంట మార్పిడి విధానాన్ని ప్రోత్సహించి, సరైన విత్తనాల ఎంపికలో రైతులకు మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, రైతు రుణమాఫీ వంటి పథకాల ద్వారా రైతులకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా, మండల వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక సర్పంచ్, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్, పీఏసీఎస్ చైర్మన్, సంపత్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# త్వరలో దొంగలను పట్టుకుంటాం

*** జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల**



ప్రజాస్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లా బాసర మహంకాళి ఆలయంలో చోరికి పాల్పడిన గుర్తుతెలియని దొంగలను అతి త్వరలోనే పట్టుకుంటామని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. మహంకాళి ఆలయాన్ని మంగళవారం ఉదయం పరిశీలించారు. పలు వివరాలను ఆలయ ఈవో అంజనీ దేవిని అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం ఎస్పీ మీడియాతో మాట్లాడారు. మహంకాళి ఆలయంలో దొంగలు అమ్మవారి వెండి కిరీటం ను దొంగలించారని తెలిపారు. అలాగే హుండీ ఎత్తుకెళ్లి ఆలయ సమీపంలో వదిలి వెళ్ళారని తెలిపారు. ఘటనకు సంబంధించిన సీసీ కెమెరాలను పరిశీలించడం జరిగిందన్నారు. క్లూస్ టీమ్ ను రంగంలోకి దించామన్నారు.ఈ దొంగతనంపై అన్ని కోణంలో విచారణ చేస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎస్పీ చెప్పారు. ఎస్పీ వెంట వెంట భైంసా ఎఎస్పీ పత్తిపాక సాయికిరణ్, ముధోల్ సిఐ రవీంద్ర నాయక్ ఉన్నారు.

# టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ సమీక్ష సమావేశం



నల్గొండ, ప్రజాస్ఫూర్తి : టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ మంగళవారం నల్గొండ ఎలక్ట్రిసిటీ గెస్ట్ హౌస్‌లో జిల్లా స్థాయి విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో నల్గొండ సర్కిల్‌కు సంబంధించిన టీకోడ్ వారీ అంచనాలు, వివిధ అభివృద్ధి పనుల పురోగతి, అమలు పరిస్థితులు , పెండింగ్ అంశాలపై సమగ్రంగా చర్చించారు.కాలిపోయిన పనిచేయడం నిలిచిపోయిన (స్టక్ అప్) విద్యుత్ మీటర్లను త్వరితగతిన మార్చడం, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించే చర్యలను వేగవంతం చేయాలని సీఎండీ ఆదేశించారు.202324 ,2024 25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన పూర్తికాని పనుల పురోగతి, వాటి పూర్తి కోసం అవసరమైన మెటీరియల్, నిధులు మరియు ఇతర అవసరాలపై సమీక్షించారు. అలాగే 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కొత్త అంచనాలు, బడ్జెట్ ఇండెంట్లు , ప్రతిపాదిత పనులపై చర్చించారు.విద్యుత్ మౌలిక వసతుల బలోపేతానికి అవసరమైన కండక్టర్లు, కేబుళ్లు, విద్యుత్ స్తంభాలు, ఇంటర్మీడియట్ పోల్స్ ఏర్పాటు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ ప్లింత్ రైజింగ్ తదితర పనులకు అవసరమైన సామగ్రి అవసరాలను అధికారులు వివరించారు.వర్షాకాల సన్నద్ధత, విద్యుత్ అంతరాయాల నివారణ చర్యలు, ఫీడర్ల నిర్వహణ, ట్రీ ట్రిమ్మింగ్ కార్యక్రమాలు, వ్యవసాయ విద్యుత్ సరఫరా, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు మరియు వినియోగదారుల సేవల మెరుగుదలపై సమగ్రంగా చర్చించారు. వ్యవసాయ రంగానికి నాణ్యమైన,నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, మాన్సూన్ కాలంలో విద్యుత్ వ్యవస్థ సజావుగా పనిచేసేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎండీ జితేష్ వి. పాటిల్ సూచించారు.ఈ సమావేశంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్. నరసింహులు, చీఫ్ ఇంజనీర్ (రూరల్ జోన్) బాలస్వామి, ఎస్ఈ (ఆపరేషన్స్) నల్గొండ వెంకటేశ్వర్లు,నల్గొండ సర్కిల్ పరిధిలోని 33 మండలాలు, 5 మున్సిపాలిటీలకు చెందిన డీఈలు,ఏడీఈలు,ఏఈలు,ఏఏఈలు,జేఏఓలు, ఎస్ఏఓలు , ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సేవకుడు ప్రతాప్ సేవలు చిరస్మరణీయం

* **సీనియర్ జర్నలిస్టు చింతకింది కృష్ణమూర్తి**




పెద్ద పెండ్యాల, ప్రజాస్ఫూర్తి : నీతి నిజాయితీకి మారుపేరుగా నిలిచి పేద ప్రజల్లో అనేక సేవలు అందించి చిరస్థాయిగా నిలిచిన ఏకైక రాజకీయ వ్యక్తి రాజారపు ప్రతాప్ అని ఆయన సేవలు చిరస్మరణీయమని సీనియర్ జర్నలిస్టు... తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మీడియా ఇన్చార్జి చింతకింది కృష్ణమూర్తి పద్మశాలి అన్నారు. మంగళవారం ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాల గ్రామంలో గల ఆర్కే గార్డెన్లో సీనియర్ లీడర్ పేదల పెన్నిధి స్వర్గీయ ప్రతాప్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల పాటు సామాజిక సేవే లక్ష్యంగా పనిచేస్తూ వివిధ రాజకీయాల్లో పనిచేసిన గొప్ప మహనీయుడు రాజారావు ప్రతాప్ అని ఆయన కొనియాడారు. రాజారపు ప్రతాప్ ఎప్పటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవకుడు చిలువేర్ శంకర్, పద్మశాలి సీనియర్ జర్నలిస్టులు రవి యాదవ్, శ్రీనివాస్,బిర్రు సతీష్, ప్రతాప్ కుటుంబ సభ్యులు భార్య.. పిల్లలు పాల్గొన్నారు.

# ఏబీవీపీ పిలుపుతో హుస్నాబాద్ లో పాఠశాలలు బంద్



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్రవ్యాప్త పాఠశాలల బంద్ పిలుపు మేరకు హుస్నాబాద్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు విజయవంతంగా బంద్ నిర్వహించబడ్డాయి. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే డిమాండ్‌తో ఈ బంద్ చేపట్టినట్లు ఏబీవీపీ నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా ఏబీవీపీ హుస్నాబాద్ నగర కార్యదర్శి బత్తుల రాజు మాట్లాడుతూ విద్యార్థుల హక్కులు, విద్యా ప్రమాణాల పరిరక్షణ కోసం ఏబీవీపీ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలపై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హుస్నాబాద్ మండలంలోని పాఠశాలలు బంద్‌కు సహకరించినందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యలు పూర్తిగా పరిష్కరించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ భీమగోని చరణ్, నగర ఉపాధ్యక్షుడు బావు అంజి, నగర సంయుక్త కార్యదర్శి అరుణ్, కుమార్ శరత్ వంశీ ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు రన్ హుస్సేన్ పగటి సవారి పండుగ



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ మున్సిపాలిటీ 6వ వార్డు బేతోలు గ్రామంలో బుధవారం హాసేన్ హుస్సేన్ పగటి సవారి పీరీల పండుగ నిర్వహించనున్నట్లు ముస్లిం మత పెద్ద షేక్ యూసుఫ్ తెలిపారు. పీరీల గుండం వద్ద భక్తులు తయారు చేసిన పాల మాటికీలతో ప్రార్థనలు (ఫాతిహాలు) ఇచ్చి పానకం పంచి పెడతారని అన్నారు.భారీగా కందుర్లు చేయనున్న భక్తులు హసేన్ హుస్సేన్ సవారి పీరీల ఆశురుఖానా (కొట్టం) నుండి బయటికి తీస్తుంటే గొర్రెపోతులు కోసి ఫాతేహా (ప్రార్థనలు) నైవేద్యం సమర్పిస్తారు.మొక్కుకున్న వాళ్లు, కోరికలు తీరిన వాళ్లు హిందూ ముస్లింలు పెద్ద ఎత్తున రంగుల దట్టీలు, కుడకలు బెల్లంతో తయారు చేసిన బాసింగాలు. వెండి బంగారంతో తొట్టెలు చేసి భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లిస్తారన్నారు. ఈ పండగలో ఇమామ్ హుస్సేన్ త్యాగాలను స్మరించుకుంటామన్నారు.27న మొహరం ఘనంగా నిర్వహిస్తారని అన్నారు.

# విబిజీ రాంజీ విధానాన్ని రద్దుచేసి ఎన్ఆర్ఈజీఎస్‌ను పునరుద్ధరించాలి

* **బికెఎంయు జిల్లా నాయకులు రేసు ఎల్లయ్య, పూర్ణచందర్ రావు**




ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పనిలో విబిజీ రాంజీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, ఉపాధి కార్మికుల హక్కులను కాపాడాలని వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు ఎల్లయ్య, అధ్యక్షులు వి.పూర్ణచందర్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీకేఎంయూ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలకు కేంద్రం పాల్పడుతోందని విమర్శించారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకాన్ని పునరుద్ధరించి పటిష్టంగా అమలు చేయాలని, ఏటా వంద రోజులకు కాకుండా 200 రోజులు పని కల్పించి, దినసరి వేతనం రూ.700లు చెల్లించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో కార్మికుడు అంగవైకల్యం పొందినా, మరణించినా రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు, పని ప్రదేశాల్లో నీడ, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బికెఎంయు, ఏఐకెఎస్, సిపిఐ నాయకులు ఎస్.డి. సలీం, ముత్యాల విశ్వనాథం, సప్క నాగేశ్వరరావు, కొమరం హనుమంతరావు, వేములపల్లి శ్రీను, పద్మజ, నిమ్మల రాంబాబు, అన్నారపు వెంకటేశ్వర్లు, గుర్రం వెంకటేశ్వర్లు, అజ్మీర శ్రీనివాస, వాడే లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# పట్టపగలే కత్తుల కలకలం..! యువకుడిపై దారుణ దాడి

* **ఛాతిలో పొడిచి పరారైన దుండగులు..**
* **రైతుల అప్రమత్తతతో ప్రాణాపాయం తప్పిన యువకుడు**



కాటారం, (ప్రజా స్ఫూర్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో పట్టపగలే జరిగిన కత్తుల దాడి కలకలం రేపింది. గుర్తుతెలియని దుండగులు ఓ యువకుడిపై విచక్షణా రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన మంగళవారం ధన్వాడ-గుమ్మల్లపల్లి గ్రామాల మధ్య చోటుచేసుకుంది.స్థానికుల వివరాల ప్రకారం.. ఓడిపిలవంచ గ్రామానికి చెందిన చిగురు గణేష్ అనే యువకుడిపై గుర్తుతెలియని వ్యక్తులు అకస్మాత్తుగా కత్తులతో దాడి చేశారు. దుండగుల దాడితో గణేష్ తీవ్రంగా గాయపడి సహాయం కోసం కేకలు వేయడంతో సమీపంలోని రైతులు అప్రమత్తమై ఘటనాస్థలికి పరుగులు తీశారు. రైతులు వస్తున్నట్లు గమనించిన దుండగులు వెంటనే అక్కడి నుంచి పరారయ్యారు. దాడిలో గణేష్ ఛాతి భాగంలో తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం అతడిని భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. దాడికి గల కారణాలపై పలు కోణాల్లో విచారణ చేపట్టారు. వ్యక్తిగత విభేదాలా..? లేక పాత కక్షలా..? అనే అంశాలపై దర్యాప్తు సాగిస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు కాటారం ఎస్సై గడ్డం శ్రీనివాస్ వెల్లడించారు. పట్టపగలే జరిగిన ఈ దారుణ ఘటన స్థానికంగా భయాందోళనలు కలిగించింది.

# నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థల వ్యాపారం అరికట్టాలి

* **జిల్లా విద్యాశాఖ అధికారి డీఈఓ కు వినతి**



ప్రజాస్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రైవేటు విద్యాసంస్థల అధిక ఫీజులు మరియు బుక్స్, బ్యాగులు, యూనిఫాం అక్రమ విక్రయాలను, విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని దానితోపాటు ఎటువంటి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక రేట్లకు నోటు పుస్తకాలు, అమ్మడం జరుగుతుంది ప్రైవేటు స్కూల్ యజమాన్యాలపే పరమైన చర్యలు తీసుకొని బయట అమ్ముతున్న షాపులను వెంటనే సీజ్ చేయాలని తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లపు తులసీరామ్ జిల్లా విద్యాశాఖ అధికారి డీఈఓ, కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈసందర్భంగా పల్లపు తులసీరామ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ విద్యా సంస్థలు ట్రేడింగ్ లైసెన్స్ లేకుండా, ఒరిజినల్ బిల్స్ ఇవ్వకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంతో బుక్స్, యూనిఫామ్ షూస్, బ్యాగ్స్, స్టేషనరీ సామాన్లని బయట సెటర్లో పెట్టి విద్యార్థులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. తెలియజేయడం జరిగింది. వాటిని వెంటనే సీజ్ చేసి వాటికి సంబంధించిన పాఠశాలల పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం జరిగింది. లేనిపక్షంలో తెలంగాణ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతామని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లపు తులసీరామ్ , నిర్మల్ జిల్లా అధ్యక్షులు రత్నల్లి రాజశేఖర్,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముల్క సందీప్, పాల్గొన్నారు

# సోయాబీన్ విత్తనాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్




ప్రజాస్ఫూర్తి, భైంసా: ముధోల్ మండల కేంద్రంలని క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎంఈఒ ఓఎస్ సోయాబీన్ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు సోయాబీన్ విత్తనాల బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి పక్షపాతం లేకుండా నిజమైన అర్హులైన రైతులకు విత్తనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

* **ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.27 కోట్ల అభివృద్ధి పనులకు మంజూరు**

నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.27 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ, గోదాలు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలిపారు. అలాగే ముధోల్, అష్ట, ఎడ్‌బిడ్, బోరెగాం, ముద్గల్, రాంటెక్, మచ్కల్ గ్రామాలకు గోదాముల నిర్మాణానికి సంబంధించిన మంజూరు పత్రాలను ఆయా గ్రామాల సర్పంచ్‌లకు అందజేశారు. ఈ పనులు గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

* **పట్టణంలో సుమారు 12 ఎకరాల 20 గుంటల ప్రభుత్వ భూమి స్వాధీనం**
* **జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్,**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని,జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, అన్నారు,మహబూబాబాద్ పట్టణంలోని తెలంగాణ మోడల్ స్కూల్ అనంతరం రోడ్డు, సర్వేనెంబర్ (163) లోనీ సుమారు 12 ఎకరాల 20 గుంటల ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని ఆక్రమించిన భూమిని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈరోజు ఉదయం స్వాధీనపరచుకోవడం జరిగిందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి చర్యలకు పాల్పడితే రెవెన్యూ యాక్ట్ ప్రభుత్వ నిబంధనలు,ద్వారా సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు,ప్రభుత్వ భూములు, చెరువులు,నాళాలు, పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు, ప్రత్యేక టాస్క్ ఫోర్స్ రెవెన్యూ, ల్యాండ్ సర్వే, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్, తదితర శాఖల నుండి భూముల పరిరక్షణ కోసం కమిటీ ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.ఈ ప్రభుత్వ భూమిని స్వాధీన పరుచుకున్న కార్యక్రమంలో మహబూబాబాద్ తహసిల్దార్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్, పోలీస్, మున్సిపల్, రెవెన్యూ, విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఎబివిపి ఆద్వర్యంలో పాఠశాలల బంద్...




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల దోపిడిని అరికట్టాలని , ప్రైమరీ , హైస్కూల్ విద్యార్థులకు ఫీజులు లక్షల్లో వసూలు చేస్తున్నారని వారి కంటే బీటెక్ విద్యార్థుల ఫీజులు తక్కువగా ఉన్నాయని ఎబీవిపి రాష్ట్ర కార్యదర్శి శ్యామ్ కిరణ్ అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంగళవారం నాడు అన్ని పాఠశాలలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఏబివిపి రాష్ట్ర కార్యదర్శి శ్యామ్ కిరణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పరిపాలనలో ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక వసతులు కరువైనాయని అన్నారు . గురుకుల పాఠశాలలో మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేదని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఫీజులని కట్టడి చేయాలని వారన్నారు. ఫీజుల దోపిడీపై అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లాలో విద్యావ్యవస్థ అధ్వానంగా ఉందని ఫీజులతో పాటు యూనిఫామ్ పుస్తకాల పేరుతో ఒక్కో విద్యార్థి దగ్గర 20,000 వరకు వసూలు చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 23000 ల ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని అన్నారు. జిల్లాలో విద్యా హక్కు చట్టం అమలు చేయాలని అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలో అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలను బంద్ సందర్భంగా మూసివేయడం జరిగిందని బంద్ కు సహకరించిన పాఠశాలల యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి జిల్లా కన్వీనర్ వడ్లకొండ వేణు, కుంచం వినయ్, ఉదయ్ కిరణ్, రాకేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఆకస్మిక నార్కోటిక్స్ తనిఖీలు




జనగామ,ప్రజాస్ఫూర్తి : మాదకద్రవ్యాల నిర్మూలనకు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా పట్టణంలో మంగళ వారం పోలీసులు ఆకస్మిక నార్కోటిక్స్ తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐలు భరత్, రతీష్, చెన్నకేశవులు, నర్సయ్య ల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, డాగ్ స్క్వాడ్ బృందం, సీఐలు, కానిస్టేబుళ్లు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బస్ స్టాండ్, రైల్వే స్టేషన్ లతో పాటు పట్టణం లోని అనుమానాస్పద ప్రాంతా లు, వ్యక్తులను డాగ్ స్క్వాడ్ సహాయం తో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మాదక ద్ర వ్యాల అక్రమ రవాణా, నిల్వ, వినియో గాన్ని అరికట్టడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్న పోలీసులు,తమ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అం దించాలని కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ఇటువంటి ఆకస్మిక తనిఖీలు భవిష్యత్తులో కూడా నిరంతరంగా కొనసాగుతాయని పోలీసులు వెల్లడించారు.

# హత్య చేసిన వ్యక్తి అరెస్టు



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడిని కొత్తగూడెం టూటౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చుంచుపల్లి మండలం అంబేద్కర్ నగర్‌కు చెందిన ఇనగంటి నాగరాజు అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన శివాజీ భార్యను వేధిస్తుండటంతో ఈనెల 21వ తేదీన రాత్రి సమయంలో పథకం ప్రకారం శివాజి భార్య నాగేశ్వరి, చెల్లెలు పరిశుద్ధ ప్రోద్బలంతో నాగరాజును శివాజి కత్తితో పొడిచి హత్య చేశాడు. టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టగా వన్‌టౌన్ సీఐ కరుణాకర్ మంగళవారం శివాజిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి హత్యకు వినియోగించిన కత్తి, హత్య చేసే సమయంలో వేసుకున్న టీషర్ట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు.

# భూముల ఆక్రమణపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన సిపిఐ నేతలు

హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని 1189/B సర్వే నెంబర్ 8 ఎకరాల భూమిని 1973 లో సీలింగ్ భూములను పట్టేదార్ ముత్తినేని రాంచంద్రరెడ్డి ప్రభుత్వానికి అప్పగించిన తర్వాత పల్లెల్లో దొపిడి దొరలు భూస్వాముల ఆగడాలకు అనునిత్యం బలైపోతున్న పేద ప్రజలకు కమ్యూనిస్టులుగా వారి పక్షాన నిలబడి న్యాయం చేస్తు ప్రజా పోరాటంలో పాలక ప్రభుత్వాల వల్ల అసువులు బాసిన 88 మంది అమరవీరుల స్మృతి చిహ్నంగా 1990లో ఫిపుల్ వార్ ఆసియా ఖండంలో రెండో 88 అడుగుల ఎత్తైన స్థూపాన్ని నిర్మించారని సిపిఐ హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ అన్నారు. మంగళవారం నాడు సిపిఐ నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారి ఏఓ పి.రాజు కుమార్ ద్వారా కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చినట్లు జాగీర్ సత్యనారాయణ తెలిపారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్ మాట్లాడుతూ అమరవీరుల స్థూపం నిర్మాణం అప్పటి నుండి 3 దశాబ్దాలకు పైగా అట్టి భూమి వైపు ఎవరు కన్నెత్తి కూడా చూడ లేదని 2013 లో భూముల సవరణల సందర్భంగా ఆనాడు సీలింగ్ భూమి కింద ప్రభుత్వానికి అప్పగించిన ముత్తినేని రాంచంద్రరెడ్డి వారసులు ముత్తినేని రాజేశ్వర్ రెడ్డి రెవెన్యూ, భూమి కొలతల అధికారులతో కుమ్మక్కై సీలింగ్ భూమిని యదావిధిగా పట్టా భూమిగా మార్పిడి చేయించుకోని అక్రమంగా పట్టేదార్ పాస్ బుక్ లు పొంది అట్టి భూమిలో



రియల్ ఎస్టేట్ వ్యాపారులతో చేతులు కలిపి స్థానిక ప్రజా ప్రతి నిధుల అండ దండలతో పురపాలక సంఘం అధికారుల సహకారంతో వెంచర్ ఏర్పాటు చేసి లక్షలు కొట్లు గడిస్తు న్నారని వెంటనే అమరవీరుల స్థూపం భూముల ఆక్రమణపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపించాలని జాగీర్ సత్యనారాయణ గడిపె మల్లేశ్ జిల్లా కలెక్టర్ ను కోరారు.

## ఓటరు సేవలను సులభతరం చేసేందుకు బీఎల్ఓల జాబిత

జనగామ, ప్రజాస్ఫూర్తి : ఓటర్ల నమోదు, సవరణలు, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియను మరింత పారదర్శకంగా, ప్రజలకు చేరువ చేసేందుకు జిల్లా లోని మూడు శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన బూత్ లెవల్ అధికారు లు (బీఎల్ఓలు), బీఎల్ఓ సూపర్వైజర్ల పూర్తి వివరాలను ప్రజల వీక్షణార్థం ప్ర చరించినట్లు ఎన్నికల సూపరింటెండెం ట్ శ్రీధర్ తెలిపారు. ప్రధాన ఎన్నికల అధికారి తెలంగాణ ఆదేశాల మేరకు 098 జనగామ, 099 ఘనపూర్ (స్టే షన్),100 పాలకుర్తి శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్ల పేర్లు, కేటాయిం చిన పోలింగ్ కేంద్రాలు, సంప్రదింపు ఫో న్ నంబర్లతో కూడిన సమగ్ర జాబితాల ను సంబంధిత ఎన్నికల నమోదు అధి కారుల, సహాయ ఎన్నికల నమోదు అ ధికారుల (ఏఈఆర్ఓ) కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో ప్ర దర్శించారు. జనగామ నియోజక వర్గం లో 278 పోలింగ్ కేంద్రాలకు 278 మం ది బీఎల్ఓలు, 29 మంది బీఎల్ఓ సూ పర్వైజర్లు విధులు నిర్వహించనుండగా, ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గంలో 291 పోలింగ్ కేంద్రాలకు 291 మంది బీఎల్వఓలు, 29 మంది సూపర్వైజర్లు నియమించబడ్డారు. పాలకుర్తి నియోజ కవర్గం లో 296 పోలింగ్ కేంద్రాలకు 29 6 మంది బీఎల్ఓలు, 30 మంది బీఎల్ఓ సూపర్వైజర్లు సేవలందించనున్నారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, సవరణలు, అభ్యంతరాల దాఖలు వంటి ఎన్నికల సేవలను ప్రజ లు సులభంగా పొందేందుకు ఈ చర్య లు దోహదపడతాయని అధికారులు తెలిపారు. ప్రజలు తమకు సంబంధించిన బీఎల్ఓ వివరాలను పరిశీలించి ఎన్నికల సేవలను సద్వినియోగం చేసు కోవాలని ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీధర్ కోరారు.

## పల్స్ పోలియోపై సిబ్బందికి అవగాహన



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు యూపీహెచ్‌సీ రామవరంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలకు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పబ్లిక్ హెల్త్ మేనేజర్ వి. శ్రీనివాసరావు, ఏఎన్ఎం కె. రాజేశ్వరి మాట్లాడుతూ జూన్ 28 నుంచి 30 వరకు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో 0-5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. వలస కుటుంబాల్లోని చిన్నారులను ప్రత్యేకంగా గుర్తించి వారికి కూడా పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐదేళ్లలోపు ఒక్క చిన్నారి కూడా మిగలకుండా ఇంటింటికీ వెళ్లి గుర్తించి చుక్కలు వేయాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో నర్సింగ్ ఆఫీసర్ శంకరమ్మ, ఫార్మసీ ఆఫీసర్ దిలీప్, ఏఎన్ఎంలు పద్మ, కవిత, తార, శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు రాజమణి, భవాని, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిట్‌నెస్ లేని బస్సులను రోడ్లపై తిరగనివ్వకూడదు

**– ఆర్టీవోకి ఏఐఎస్ఎఫ్ వినతి పత్రం**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: జిల్లాలో ఉన్నటువంటి అన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల బస్సుల ఫిట్నెస్‌పై సమగ్ర విచారణ జరపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ కోరారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీవో రాజశేఖర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ పరిమితి కంటే ఎక్కువ మొత్తంలో విద్యార్థులను బస్సులలో ఎక్కిస్తూ ప్రమాదాలకు గురి చేస్తున్న, లైసెన్సులు లేకుండా మైనర్ డ్రైవర్లను నియమించి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటాలాడుతున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా విద్యా సంవత్సరం పునఃప్రాంభం అయినా కూడా ఇంకా ప్రైవేట్ విద్యా సంస్థలకు చెందిన మొత్తం బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసుకోలేదన్నారు. ప్రతి బస్సుకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, పర్మిట్, కాలుష్య నియంత్రణ పత్రాలు ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఇనపల్లి పవన్ సాయి, జిల్లా ఉపాధ్యక్షులు కొరిమి సంజయ్, నాయకులు కళ్యాణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు

**- బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడూరి పరమేష్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ కు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరుకు కృషిచేసిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడూరి పరమేశ మంగళవారం ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాదులోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడూరి పరమేష్ న్యాయవాదులతో కలిసి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పడమటి మహిపాల్ రెడ్డి, సహ కార్యదర్శి మక్తల నరసింహ, లైబ్రరీ సెక్రెటరీ నర్రి స్వామి, కల్చరల్ సెక్రటరీ దేశగోని శ్రీశైలం, కార్యవర్గ సభ్యుడు ఎండి ఖయ్యూం పాషా, మాజీ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్ గౌడ్, ఎ నాగరాజు, బడుగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ విధులకు ప్రత్యేక శిక్షణ పొందిన 150 మంది పోలీసు సిబ్బందితో సీపీ సమావేశం



సైబరాబాద్, ప్రజాస్ఫూర్తి: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ విధుల నిర్వహణ కోసం ప్రత్యేక శిక్షణ పొందిన 150 మంది గ్రేహౌండ్స్ పోలీసు సిబ్బందితో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ సమావేశమయ్యారు. సీపీ కార్యాలయం ఆడిటోరియంలో జరిగిన ఈ సమావేశంలో శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బందికి ట్రాఫిక్ నిర్వహణ, ప్రజలతో మర్యాదపూర్వక వ్యవహారం, రోడ్డు భద్రత అంశాలపై సూచనలు చేశారు. వారం రోజుల పాటు నిర్వహించిన శిక్షణలో ట్రాఫిక్ నిర్వహణ, ట్రాఫిక్ ఇంజనీరింగ్, చట్టపరమైన అంశాలపై ఇండోర్, అవుట్‌డోర్ తరగతుల ద్వారా అవగాహన కల్పించినట్లు సీపీ తెలిపారు. హెల్మెట్ వినియోగం, లేన్ క్రమశిక్షణ, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ విధులకు ఆటంకం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రమాదాల వల్ల కుటుంబాలు తీవ్ర నష్టాలు చవిచూస్తున్న నేపథ్యంలో బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌పై ప్రజలను చైతన్యపరచాలని పోలీసు సిబ్బందికి సూచించారు.ఐటీ కారిడార్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఒత్తిడి అధికంగా ఉంటుందని, అక్కడ మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. వర్షా కాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమర్థవంతంగా పనిచేయాలని, సేవాభావంతో వ్యవహరిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, ఎస్‌బీ డీసీపీ సుధీంద్ర, ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి, సైబర్ క్రైమ్ డీసీపీ సాయి మనోహర్, సీఏఆర్ & హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలి

*** జిల్లా కలెక్టర్,ఎస్పీకి మెదక్ జర్నలిస్టుల వినతి**



ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: నార్సింగి మండల మన తెలంగాణ విలేకరి రాఘవేందర్ పై జరిగిన దాడి ఘటనను మెదక్ జిల్లా జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై దాడులు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు, పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించే చర్యగా అభివర్ణించారు. దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం బాధితునితో కలిసి మెదక్ జిల్లా జర్నలిస్టులు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం జిల్లా అధ్యక్షులు శంకర్ దయాళ్ చారి, టీయూడబ్ల్యూజె (143) జిల్లా నేత సురేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన షాపులకు గ్రామ పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేసిన అంశంపై వార్త ప్రచురించిన నేపథ్యంలో విలేకరి రాఘవేందర్ పై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడినట్లు వారు పేర్కొన్నారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేయడం జర్నలిస్టుల విధి అని, తమ వృత్తి బాధ్యతలను నిర్వర్తించే మీడియా ప్రతినిధులపై దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా రంగం నాలుగో స్తంభంగా గుర్తింపు పొందిందని, సమాజంలో జరుగుతున్న అక్రమాలు, అవినీతి, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఇటువంటి దాడులు జర్నలిస్టులలో భయాందోళనలు కలిగించడమే కాకుండా పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే ప్రమాదం ఉందన్నారు. రాఘవేందర్ పై జరిగిన దాడి ఘటనపై పోలీసులు సమగ్రంగా విచారణ చేపట్టి, దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కేసును అత్యంత ప్రాధాన్యతగా పరిగణించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. మీడియా ప్రతినిధుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని వినతిపత్రం లో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలను ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఉపేక్షించరాదని తెలిపారు. జర్నలిస్టులపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, తిమ్మన్నగారి శ్రీధర్, నాగరాజు శర్మ, ఫారుక్ హుస్సేన్, బొందుగుల నాగరాజు, మువ్వ నవీన్, గోపాల్ గౌడ్,కామాటి కృష్ణ, లక్ష్మి నారాయణ, పాపన్నపేట శ్రీనివాస్, శ్రీనివాస్ చారి, సందీప్, గోవర్ధన్ రెడ్డి, ఖయ్యుమ్, నీలం,చల్ల రాహుల్, రాఘవులు, మల్లేష్, కార్తీక్, శ్రీహరి, సుబ్బు, సంగమేష్, రహమాత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు

## షాద్‌నగర్‌లో పార్టీ పటిష్టతపై దృష్టి సారించండి

*** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



ప్రజాస్ఫూర్తి, షాద్‌నగర్: నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా నాయకులు కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో షాద్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు వై. రవీందర్ యాదవ్, మురళీకృష్ణ యాదవ్ మర్యాదపూర్వకంగా కేటీఆర్‌ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, కార్యకలాపాలపై కేటీఆర్ వారితో చర్చించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమవుతోందని ప్రజలకు వివరించడంతో పాటు క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి పూర్తిస్థాయిలో కృషి చేయాలని నాయకులకు సూచించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం, ఓటర్ల జాబితా మార్పులు, పార్టీ విస్తరణ తదితర అంశాలపై అనుసరించాల్సిన వ్యూహాలను వివరించారు.రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ మరింత బలంగా ప్రజల్లోకి వెళ్తుందని, కార్యకర్తలు ప్రజల మధ్య నిరంతరం ఉండాలని కేటీఆర్ దిశానిర్దేశం చేసినట్లు నాయకులు తెలిపారు. అనంతరం మురళీకృష్ణ యాదవ్ కేటీఆర్‌తో సెల్ఫీ దిగగా, ఆ ఫోటోను మీడియాతో పంచుకున్నారు.ఈ సందర్భంగా వై. రవీందర్ యాదవ్ మాట్లాడుతూ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకోవడం జరిగిందని, పార్టీ పటిష్టత కోసం ఆయన ఇచ్చిన సూచనలు, సలహాలను కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు.

## ఘనంగా సంజీవ్ నాయక్ పుట్టినరోజు వేడుకలు



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: సేవాలాల్ సేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు భూక్య సంజీవ్ నాయక్ పుట్టినరోజు వేడుకలను కొత్తగూడెం పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు మాళోత్ శివ నాయక్, ఉపాధ్యక్షులు బట్టు హుస్సేన్ నాయక్‌ల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు బానోత్ వీరు నాయక్ పాల్గొని కేక్ కట్ చేసిన అనంతరం మాట్లాడుతూ గిరిజనుల సమస్యల సాధన కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్న వ్యక్తి సంజీవ్ నాయక్ అని కొనియాడారు. ఏజెన్సీ చట్టాలపై గిరిజనుల్లో చైతన్యం కల్పిస్తూ హక్కుల కోసం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన నాయకులు ధరావత్ కాన్షీరామ్ నాయక్, ఉద్యోగ సేన రాష్ట్ర అధ్యక్షులు భూక్య బాబూలాల్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సపావత్ బాలకృష్ణ నాయక్, టీఎస్ టిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మోహన్ రాథోడ్ నాయక్, రైతు సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారావత్ కృష్ణ నాయక్, సోషల్ మీడియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్ నాయక్, సేవలల్ మహిళా సేన జిల్లా అధ్యక్షులు రుక్మిణి బాయి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారం అందేలా చర్యలు తీసుకోవాలి

*** షాద్‌నగర్ ఆర్డీవో ఎన్ఆర్ సరిత**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని షాద్‌నగర్ ఆర్డీవో ఎన్ఆర్ సరిత సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా ప్రతి ఇంటికి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేసి, ఓటర్లు తమ వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఫారాల్లో తప్పు సమాచారం నమోదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. డివిజన్ పరిధిలో ఓటర్ల వివరాల మ్యాపింగ్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని, ఇప్పటికే అధిక శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఇంకా మిగిలిన వివరాలను కూడా త్వరలో పూర్తి చేయనున్నట్లు చెప్పారు. మ్యాపింగ్ పూర్తయిన వారికే కాకుండా మిగిలిన ప్రతి అర్హ ఓటరికి కూడా ఎన్యుమరేషన్ ఫారాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఓటరు జాబితాలో పేరు కొనసాగాలంటే తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాలని, ఫారాలు సమర్పించని వారి వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తారని, ప్రజలు వారికి సహకరించాలని కోరారు. ఓటరు ధృవీకరణకు అవసరమైన పత్రాలను సమర్పించడం ద్వారా మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయవచ్చని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆర్డీవో సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల బంద్ విజయవంతం




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఏబీవీపీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ చౌటుప్పల్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన విద్యాసంస్థల బందు విజయవంతమైంది. చౌటుప్పల్ పట్టణ, మండలాలలోని ప్రైవేటు పాఠశాలలు స్వచ్ఛందంగా బందద ను పాటించాయి. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకుడు బతరాజు కార్తీక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 12వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేలైన దిశగా ప్రణాలికలు రచిస్తుందని ఆరోపించారు. అదేవిధంగా కార్పొరేట్ విద్యాసంస్థలకు విద్యాశాఖ అధికారులు విద్యాశాఖ యంత్రాంగం తొత్తుగా మారిందని ఆరోపించారు. ప్రైవేట్ మాఫియా లాగా తయారవుతున్న ప్రైవేట్ పాఠశాలలకు మద్దతు పలుకుతున్న విద్యాశాఖ యంత్రాంగం సమాధానం చెప్పాలని, లేనిపక్షంలో రానున్న రోజులలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో మరిన్ని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు దూసరి శివ, సాయి, పల్చం రిత్విక్, అభి, కొత్త సాయి, నందగిరి ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులతో మాజీ సర్పంచ్ ఆత్మహత్య

* మాజీ సర్పంచ్ పిట్టల సంపత్ ఆత్మహత్య కాదు ప్రభుత్వ హత్య.
* బిఆర్ఎస్ నాయకుల ఆందోళన కుటుంబానికి మద్దతు.

హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మహమ్మదాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ పిట్టల సంపత్ మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గతంలో రెండు పర్యాయాలు మా మహమ్మదాపూర్ గ్రామానికి సర్పంచ్ గా పనిచేసిన పిట్టల సంపత్ ఆర్థికంగా అప్పులు ఎక్కువ కావడంతో భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అయితే గతంలో గ్రామపంచాయతీ అభివృద్ధికి అప్పులు చేసి తీవ్రంగా ఆర్థికంగా దెబ్బతిన్నాడని అందుకనే అప్పులు ఎక్కువ కావడంతో తీవ్ర మనస్తాపం చెందిన సంపత్ చెట్టుకురేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై స్పందించిన టిఆర్ఎస్ నాయకులు ఇది పూర్తిగా ప్రభుత్వ హత్య అని మాజీ సర్పంచ్ ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరం ,తను సర్పంచ్ గా చేసిన హయాంలో లక్షలు అప్పులుగా తెచ్చి గ్రామ అభివృద్ధి కోసం వెచ్చిస్తే బిల్లులు రాక భూమి, పండ్ల తోట అమ్మిన కూడా అప్పులు చెల్లించలేక మనస్తాపం చెంది చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడం జరిగిందన్నారు. మాజీ సర్పంచ్ ముమ్మాటికీ ప్రభుత్వ హత్యగా చెప్పుకోవచ్చునని, గతంలో పెండింగ్ బిల్లుల కోసం హైకోర్ట్ కి వెళ్లి కేసు వేయడం జరిగిందని అయినా ప్రభుత్వం స్పందించకుండా ఉండడం అనేది ఎంత దుర్మార్గ చర్యనో హుస్నాబాద్ ప్రజలు అర్థం చేసుకోవాలని బిఆర్ఎస్ నాయకులు ఐలని మల్లికార్జున్ రెడ్డి ఆరోపించారు,పెండింగ్ బిల్లులు చెల్లించాలని చివరగా హుస్నాబాద్



ఏసీపీ ఆఫీస్ ముందు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాలపడడం జరిగిన హుస్నాబాద్ ఏసీపీ సదానందం స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించకపోవడం చాలా బాధకారం, ఇప్పటికైనా మాజీ సర్పంచ్ పెండింగ్ బిల్లులు చెల్లించి,మృతుని కుటుంబానికి 50లక్షల ఎక్సగ్రేసియా చెల్లించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మిగితా మాజీ సర్పంచుల యొక్క పెండింగ్ బిల్లులు కూడా విడుదల చేయాలి లేకుంటే వారు ఆర్థిక ఇబ్బందులను తట్టుకోక ఏదైనా చేసుకోవాలనే ఆలోచన వస్తుంది కాబట్టి మాజీ సర్పంచుల యొక్క బిల్లులు చెల్లించి మాజీ సర్పంచుల కుటుంబాలను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అలాగే స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ కు విజ్ఞప్తి చేశారు

## విద్యార్థుల నైపుణ్యాలు పెరిగేలా విద్యా బోధన ఉండాలి

* జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




ప్రజాస్ఫూర్తి, భైంసా: ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల నైపుణ్యాలు పెరిగేలా విద్యా బోధన సాగాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని (కేజీబీవీ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతిగదిలోని విద్యార్థులతో కలెక్టర్ పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగారు. వారితో లెక్కలు చేయించారు. విద్యార్థులు పాఠాలను సులువుగా అర్థం చేసుకునే మెలుకువలు నేర్చుకోవాలన్నారు. సామాజిక అంశాల్లో భాగస్వామ్యం అవుతూ పలు విషయాల్లో అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు నేర్పిస్తున్న చదువు, అందిస్తున్న భోజనం సక్రమంగా ఉన్నాయో లేవో వారిని అడిగి తెలుసుకున్నారు.అధికారులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, పిల్లలకు చదువుతో పాటు, నైపుణ్యాభివృద్ధి తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు వచ్చే సందేహాలు నివృత్తి చేస్తూ ఉండాలని తెలిపారు. ప్రతి రోజు అన్ని పూటల కామన్ మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని చెప్పారు. విద్యార్థులకు వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. అనంతరం ఖానాపూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు పరిశీలించారు. రెవెన్యూ అంశాలకు సంబంధించిన దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలని చెప్పారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఏవైనా భూ సమస్యలు ఉన్నాయేమో అని అడిగి తెలుసుకున్నారు.ఈ తనిఖీలలో డిఈఓ భోజన్న, తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో రాధా రాథోడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల భూమి పోరాటం విజయవంతం చేయాలి



ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: మెదక్ పట్టణంలోని టీఎన్జీఓ భవనంలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ ఆధ్వర్యంలో జూలై 2న హైదరాబాద్‌లో నిర్వహించనున్న "ఉద్యమకారుల భూమి పోరాటం" కార్యక్రమానికి సంబంధించి పత్రికా సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో రాష్ట్ర స్థాయి నాయకురాలు, మెదక్ జిల్లా ఉద్యమకారుల ఇన్‌చార్జ్ వేముల భవాని,మెదక్ జిల్లా టీఆర్ఎస్ ఇన్‌చార్జ్ పీ. చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉద్యమకారుల హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న "ఉద్యమకారుల భూమి పోరాటం" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జూలై 2న హైదరాబాద్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ఉద్యమకారులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి నాయకురాలు కవిత, నర్సాపూర్ టిఆర్ఎస్ నాయకురాలు అపర్ణ, మెదక్ నియోజకవర్గ ఇన్చార్జి బట్టి అజయ్, రమేష్ గౌడ్, మెదక్ నియోజకవర్గం టిఆర్ఎస్ నాయకులు రమేష్ మెదక్ టౌన్ కు చెందిన టిఆర్ఎస్ నాయకులు భాను, అశోక్, నవీన్, గౌండ, నెల్లి రాజు, యోహాన్ ఇతర టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలు, గర్భిణీ స్త్రీలకు నాణ్యమైన పోషకాహారం అందేలా నిరంతర పర్యవేక్షణ అవసరం

* జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



భువనగిరి, ప్రజాస్ఫూర్తి: మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఉన్న అంగన్వాడీ సెంటర్ , భవిత సెంటర్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముందుగా భవిత సెంటర్‌ను సందర్శించి ప్రస్తుతం ఎంత మంది విద్యార్థులు ఉన్నారు, వారికి శిక్షణ ఎవరు అందిస్తున్నారు, ఎలా అందిస్తున్నారని అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మండలంలో ఇంకా ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలు ఉన్నారా, ఉంటే వారిని ఎలా గుర్తిస్తున్న సర్వే ప్రక్రియ ఎలా నిర్వహిస్తున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం నిర్మాణంలో ఉన్న నూతన భవిత భవనం పనులను పరిశీలించారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులు ఏమిటి, వాటిని ఎప్పటిలోగా పూర్తి చేస్తారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.తదుపరి అంగన్వాడీ సెంటర్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్, మండలంలో మొత్తం ఎన్ని అంగన్వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి అనే వివరాలను తెలుసుకున్నారు. కేంద్రంలో ప్రస్తుతం ఎంత మంది చిన్నారులు ఉన్నారని, అందులో ఎంత మంది గర్భిణీ స్త్రీలు నమోదు అయ్యారో అనే వివరాలను అడిగి తెలుసుకొని వారందరికీ ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందిస్తున్నారా, రోజువారీగా గుడ్డు ఇస్తున్నారా అని ఆరా తీశారు.ప్రతి రోజు పిల్లలకు అందించిన ఆహారం, గుడ్ల నాణ్యతను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. పిల్లల ఎత్తు, బరువును క్రమం తప్పకుండా చూసి రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పోషకాహార పంపిణీలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రశ్నాపత్రాల లీకేజీ, పరీక్షల రద్దుపై భారీ నిరసన

– జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మానవహారం



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాట మాడుతూ ప్రశ్నాపత్రాల లీకేజీ, పరీక్షల రద్దు ఘటనలకు నిరసనగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ఆధ్వర్యంలో మంగళవారం కొత్తగూడెం పట్టణంలో భారీ ఎత్తున నిరసన సభ, మానవహారం కార్యక్రమం నిర్వహించారు. తొలుత చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ నుంచి సూపర్ బజార్ వరకు కార్యకర్తలు భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సూపర్ బజార్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేశారు. 'పేపర్ లీక్ దొంగలను అరెస్ట్ చేయాలి', 'విద్యార్థుల కలలు కూల్చొద్దు','బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోండి' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న మాట్లాడుతూ కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని కోరారు. సంవత్సరానికి రెండు కోట్ల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తానని ఇచ్చిన హామీని తుంగలో తొక్కుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్న మోడీ,విద్యార్థులకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 'పరీక్ష రాసిన ప్రతి విద్యార్థికి న్యాయం జరగాలని, వారి కష్టానికి తగ్గ ఫలితం ఇవ్వాలని, రద్దైన పరీక్షలు వెంటనే నిర్వహించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురం లలిత కుమారి, ప్రసన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్, రాష్ట్ర నాయకులు ఆళ్ళ మురళి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గద్దల రమేష్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి వై.శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు, హనుమంతు, జానీ పాషా, జిల్లా ప్రధాన కార్యదర్శిలు ఎం ప్రసాద్ బాబు, పైడా రాజేంద్రప్రసాద్, లోశెట్టి నాగార్జున, జిల్లా కార్యదర్శులు నూకల రంగారావు, ఆంతోటి పాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, సర్పంచులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలం.. పాములతో జర భద్రం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: వర్షాకాలంలో జనావాసాల్లో పాముల సంచారం పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాణధార ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్ సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో పాములు ఎక్కువగా బయటకు వస్తున్నాయని తెలిపారు.గత రెండు రోజుల్లోనే కొత్తగూడెంలోని 7 హిల్స్ ఏరియా, ఫ్యాన్‌బస్తీ, రామవరం, బాబుక్యాంప్, బర్మా క్యాంప్, పాల్వంచ ప్రాంతాల్లో ఆరు విషసర్పాలు, మూడు విషరహిత సర్పాలను పట్టుకుని అటవీ ప్రాంతాల్లో వదిలినట్లు చెప్పారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ఆహారం, సంతానోత్పత్తి కోసం సర్పాలు ఎక్కువగా సంచరిస్తాయని పేర్కొన్నారు. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, పాములు దాక్కునేలా ఉన్న పనికిరాని వస్తువులు, చెత్తను తొలగించాలని సూచించారు. రాత్రి వేళల్లో ఇంటి పరిసరాల్లో తగినంత వెలుతురు ఉండేలా చూసుకోవాలని తెలిపారు.వ్యవసాయ పనులకు వెళ్లేవారు కాళ్లకు గమ్‌బూట్లు ధరించాలని, రాత్రి సమయంలో టార్చ్‌లైట్ ఉపయోగించాలని సూచించారు. పాము కనిపించిన సందర్భంలో సాధ్యమైనంత వరకు ఫొటో తీయడం లేదా దాని గుర్తులు, రంగు, మచ్చల గురించి సమాచారం ఇవ్వడం వల్ల రక్షణ చర్యలు త్వరగా చేపట్టేందుకు వీలవుతుందని తెలిపారు. పాములు కనిపించినప్పుడు వాటిని చంపే ప్రయత్నం చేయకుండా, నిపుణులకు సమాచారం అందించాలని సంతోష్ కోరారు.

## రైతులు విత్తన మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

: కలెక్టర్ అంకిత్



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రతి మండలంలో నిర్వహిస్తున్న విత్తన మేళాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. మంగళవారం పాల్వంచ మండలం జగన్నాధపురం రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం మేళాలో ఏర్పాటు చేసిన విత్తనాలు, వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించి, విత్తనాల ప్యాకెట్లపై ఉన్న క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసి వాటి ప్రామాణికతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన అన్ని రకాల ధ్రువీకరించిన, నాణ్యమైన విత్తనాలను ఒకే వేదికపై సరసమైన ధరలకు అందించేందుకు వ్యవసాయ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు. రైతు వేదికలలో నిర్వహిస్తున్న విత్తన మేళాల్లో సన్న రకాల వరి విత్తనాలు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డీఏపీ వంటి ఆధునిక వ్యవసాయ ఉత్పత్తులు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. నకిలీ విత్తనాల విక్రయం, విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. విత్తన మేళా ద్వారా విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు, యూరియా బుకింగ్ ద్వారా యూరియా బుక్ చేసుకున్న రైతులకు కలెక్టర్ చేతులమీదుగా విత్తనాలు, యూరియా అందించారు. ఈ కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, సొసైటీ ఛైర్మెన్ కొత్వాల శ్రీనివాస్, తహశీల్దార్ దారా ప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త పథకం.. ఉత్తమ పేరు సూచిస్తే రూ.లక్ష బహుమతి

హైదరాబాద్: నగరంలో 'క్యూర్' పరిధి (ఓఆర్ఆర్ లోపలి ప్రాంతం)లో లక్ష ఇళ్ల నిర్మాణానికి హౌసింగ్ బోర్డు కసరత్తు చేస్తోంది. ఈ కొత్త పథకానికి పేరు కోసం ప్రజల నుంచి సూచనలు ఆహ్వానిస్తోంది. ఉత్తమ పేరు సూచించిన వారికి రూ.లక్ష బహుమతి ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఈనెల 28 వరకు పేరు సూచించవచ్చని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గౌతమ్ తెలిపారు. tghd.official ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా పోటీలో పాల్గొనవచ్చన్నారు.

## రైతులు ధృవీకరించిన విత్తనాలనే కొనుగోలు చేయాలి

* మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి




ప్రజాస్ఫూర్తి , షాద్నగర్: రైతులు ధృవీకరించిన విత్తనాలనే కొనుగోలు చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కొందుర్గు రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళా (సీడ్ మేళా) ప్రచార కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. రైతులకు నాణ్యమైన ధృవీకరించిన విత్తనాలు అందించడంతో పాటు ఆధునిక సాగు పద్ధతులు, పంటల యాజమాన్యంపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజేందర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు లక్ష్మీకాంత్, రమణ, వాసవి, వెంకటేష్, ఎరువుల దుకాణాల యజమానులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఒక దేశంలో రెండు రాజ్యాంగాలు రెండు జెండాలు ఉండకూడదని పోరాడిన మహనీయుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ

* బీజేపీ మండల అధ్యక్షులు సొల్ల క్రాంతి కుమార్



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ఒక దేశంలో రెండు రాజ్యాంగాలు రెండు జెండాలు ఉండకూడదని పోరాడిన మహనీయుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ మండల అధ్యక్షులు సొల్ల క్రాంతి కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి బలిదాన్ దివస్ సందర్భంగా ముస్తాబాద్ మండల కేంద్రంలో నివాళులు అర్పించారు. స్వామి వివేకానంద విగ్రహం వద్ద డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించిన అనంతరం సొల్ల క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఆర్టికల్ 370 రద్దు చేయాలని, ఒక దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు ఉండకూడదని కశ్మీర్ భారత్ లోని అంతర్భాగమేనని ముఖర్జీ పోరాడారని గుర్తు చేశారు. వినాయక్ దామోదర్ సావర్కర్ తో బాటు ముఖర్జీ కూడా భారతదేశంలో హిందూజాతీయవాదపు, ముఖ్యంగా హిందూత్వ ఉద్యమమునకు ప్రముఖుడిగా పరిగణించబడతారని పేర్కొన్నారు.

## విద్యార్థి యువత గొంతుక ఉద్యమానికి మద్దతు

* డిసిసి అధ్యక్షుడు పున్న కైలాస్ నేత



నల్లగొండ,ప్రజాస్ఫూర్తి : లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ "ఇటీవల" రాజస్థాన్ లోని కోట లో జరిగిన చాత్రోంకి గూంజ్ విద్యార్థి యువత గొంతుక అనే మహా ఉద్యమాన్ని ప్రారంభించారని ఈ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని మంగళవారం నల్గొండ జిల్లా కేంద్రం యాదవ్ సంఘం భవన్ లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత తెలిపారు.ఈ ఉద్యమానికి నల్గొండ డిసిసి కమిటీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. నీట్ పరీక్షల రద్దుకు బాధ్యత వహించి కేంద్ర విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేస్తున్నాం ఇది సంపూర్ణంగా మోడీ ప్రభుత్వం వైఫల్యం అని దేశ పార్లమెంట్లో దీనిపై ఎన్డిఏ ప్రభుత్వం ప్రకటన చేయాలని దేశ ప్రజలకు నరేంద్ర మోడీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. పరీక్ష రద్దు వలన సుమారు 25 లక్షల కుటుంబాలు నష్టపోయాయి అన్నారు. ప్రశ్నపత్రాల లీకులు పరీక్షల రద్దు ఉద్యోగ నియామకాలలో జాప్యం నిరుద్యోగం 148 సార్లు పరీక్షలు లీక్ అయ్యాయి 2014 నుండి నేటి వరకు ఎన్టిఏ కోసం ప్రశ్నపత్రాన్ని రూపొందించిన డాక్టర్ ప్రశ్న పత్రాన్ని అమ్ముకుంటుంటే మోడీ నిఘా వ్యవస్థ నిద్రావస్థలో ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బోడ స్వామి, ఓబిసి సెల్ జిల్లా అధ్యక్షులు జిల్లాపల్లి పరమేష్,ఏళ్ల రవీందర్ రెడ్డి, పగిళ్ల రాజు, చర్లపెల్లి గౌతమ్, వేముల గోపీనాథ్, బట్టు జంగయ్య, ఎండి అజీజ్ ,చింత ధనుంజయ్, జమ్మూ అశోక్, ఆకటి సైదులు, ఎండి అమన్ తదితరులు పాల్గొన్నారు..

## జాతీయ అహింస ధ్యాన మహాసభలను విజయవంతం చేయాలి




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: అక్టోబర్ 1 నుండి 5వ తేదీ వరకు హైదరాబాద్ లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో జరిగే జాతీయ అహింస ధ్యాన మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం జిల్లా కేంద్రంలో శివసాయి పిరమిడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య దివ్య శ్రీనివాస్ మాట్లాడుతూ పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీస్ మూవ్‌మెంట్, వెజిటేరియన్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శాకాహారం, జీవకారుణ్యం, ధ్యానం పట్ల అవగాహన పెంచడానికి ఈ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభల విజయవంతం కోసం శాకాహార ధ్యాన ప్రచార రథాలతో మెగా శాకాహార ప్రచార ర్యాలీలు,యాత్రలు చేపట్టినట్లు తెలిపారు. శాఖాహారమే మానవాహారమని, దైవత్వానికి చేరువ చేసేది శాఖాహారం మాత్రమే అని అన్నారు.ధ్యానం సర్వరోగ నివారిణిగా పని చేస్తుందని పేర్కొన్నారు. అహింసతోనే మానవ ప్రగతి సాధ్యమని పేర్కొన్నారు. అనంతరం శివసాయి పిరమిడ్ ధ్యాన మందిరంలో ప్రత్యేక ధ్యాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకులు కోటగిరి రాధాకృష్ణ, శివ సాయి పిరమిడ్ ట్రస్ట్ ప్రెసిడెంట్ తోట నాగమణి, సెక్రటరీ జీ.వెంకటేశ్, ట్రెజరర్ చందా విశ్వం, మానుపురి దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల వినియోగంతో.. భవిష్యత్ అంధాకారం

* విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన
* చౌటుప్పల్ సిఐ మన్మధ కుమార్






చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మాదక ద్రవ్యాల వినియోగంతో శారీరక, మానసిక ఆరోగ్యం క్షీణించడంతో పాటు భవిష్యత్తు పూర్తిగా అంధాకారం వుతుందని చౌటుప్పల్ సిఐ మన్మధ కుమార్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మన్మధ కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల చదువు, కుటుంబానికి దూరమవుతారన్నారు. భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఎవరైనా డ్రగ్స్ వినియోగించమని ప్రలోభపెడితే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే తప్పుడు ప్రలోభాలకు లోనుకాకుండా, మంచి స్నేహితులను ఎంచుకోవాలని సూచించారు. విద్య, క్రీడలు, ఇతర సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి పెట్టి విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. సమాజంలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కలు, పందులు, కోతుల బెడద పై సమీక్ష సమావేశం



జనగామ, ప్రజస్ఫూర్తి : పట్టణంలోని ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వీధి కుక్కలు, పందులు, కోతుల సమ స్యల పై సోమవారం మున్సిపల్ కార్యా లయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమా వేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం లో మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి పట్టణ సమస్యల పై అధికారుల తో విస్తృతంగా చర్చించారు. ప్రత్యేకంగా వీధి కుక్కలు, పందులు, కోతుల సంచా రంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బం దులు, భద్రతా, పరిశుభ్రత తదితర అంశాల పై సమావేశంలో సుదీర్ఘంగా సమీక్షించారు.ఈ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, సంబంధి త శాఖల సమన్వయంతో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అధికారులు తమ అభి ప్రాయాలను వెల్లడించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగి న చర్యలు తీసుకోవాలని సమావేశం లో నిర్ణయించినట్లు అధికారులు వెల్ల డించారు. కార్యక్రమంలో అన్ని వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ఉచిత ఫ్రీజర్ బాక్స్ సేవలు అందించనున్న లైన్స్ క్లబ్



నల్లగొండ. ప్రజాస్ఫూర్తి : లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న నేత్ర, పార్థివ దేహ దాన సేవా కేంద్రం ద్వారా ప్రజల సేవార్థం 24×7 ఫ్రీజర్ బాక్స్ సేవలు ప్రారంభిస్తున్నట్లు నేత్ర పార్థివ దేహ దాన సేవా కేంద్రం కోఆర్డినేటర్ చిరునోముల చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం స్థానిక లయన్స్ భవన్లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ చారిటబుల్ ట్రస్ట్ నేత్ర,పార్థివ దేహ దాన సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఇప్పటివరకు 410 జతల కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని వివిధ నేత్ర బ్యాంకులకు అందించడం ద్వారా 820 మంది కార్నియల్ అంధులకు చూపు ప్రసాదించే అవకాశాన్ని కల్పించగలిగాము అన్నారు. అదేవిధంగా 15 పార్థివ దేహదానాలను విజయవంతంగా నిర్వహించి నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాల మరియు కామినేని వైద్య కళాశాలలకు అందించడం జరిగిందన్నారు. కుటుంబ సభ్యులు తమ ప్రియమైన వారిని కోల్పోయిన సమయంలో ఫ్రీజర్ బాక్స్ ఏర్పాటు చేయడం ఒక అదనపు భారంగా మారుతుంది. ఆ బాధాకర సమయంలో కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశ్యంతో ఈ సేవను ప్రారంభించడానికి సంకల్పించాము. ప్రస్తుతం అత్యంత ఆధునిక సాంకేతికతతో కూడిన 5 ఫ్రీజర్ బాక్స్‌లు అందుబాటులో ఉండగా, భవిష్యత్తులో మరిన్ని ఫ్రీజర్ బాక్స్‌లను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నాము.నల్గొండ పట్టణం నుండి 10 కిలోమీటర్ల పరిధిలో ఈ సేవను రోజుకు కేవలం ₹2,000 రాయితీ రుసుముతో (రవాణా 1200/ మరియు నిర్వహణ 800/ వ్యయాలతో కలిపి) అందించనున్నాము ఫ్రీజర్ బాక్స్ సేవల ద్వారా మరింత ముందస్తు సమాచారం అందుకొని, అవసరమైన కుటుంబాలకు నేత్రదానం మరియు పార్థివ దేహదానంపై అవగాహన కల్పించే అవకాశం లభిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, వైద్యులు, ఆసుపత్రుల నిర్వాహకులు, అంబులెన్స్ నిర్వాహకులు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు మరియు స్వచ్ఛంద సంస్థలు ఈ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరుతున్నాము. అవసరమున్నవారు 9666243657, 9948143299, నెంబర్లను సంప్రదించవచ్చు అన్నారు.

## మహిళా సంఘాలే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక

* ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



ప్రజాస్ఫూర్తి , భైంసా: నిర్మల్ జిల్లా ముధోల్ మండల కేంద్రంలో సీఎంటీసీ సీఎంటీ సీ, జీఆర్‌సీ కేంద్రాలను ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడమే ఈ కేంద్రాల ప్రధాన లక్ష్యమని అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వల మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న ఎమ్మెల్యే, మహిళా సంఘాలు కేవలం పొదుపు సంఘాలుగానే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే శక్తిగా ఎదిగాయని అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధిస్తూ కుటుంబాల అభివృద్ధికి, సమాజ పురోగతికి కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, స్వయం ఉపాధి రంగంలో ప్రోత్సహించడం, వడ్డీ రహిత రుణాలు అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.మహిళా సంఘాలు మరింత బలోపేతం అయితే గ్రామాల అభివృద్ధి వేగవంతం అవుతుందని, కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని పేర్కొన్నారు.అలాగే సీఎంటీసీ, జీఆర్‌సీ కేంద్రాల ద్వారా ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించి ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రజల సంక్షేమం, మహిళల అభ్యున్నతి, గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రొటీన్లతో అలసట మాయం!



**ఉదయాన్నే నిద్ర లేచింది మొదలు.. ఊపిరి సలపని పనులతో క్షణం తీరిక ఉండదు. మరోవైపు ఆఫీసులో ఒత్తిడి, అలసటతో సతమతమవుతాం. ఇలాంటి బిజీ లైఫ్‌స్టైల్‌తో ఎదురయ్యే అలసటను దూరం చేసుకొని చురుగ్గా మారాలంటే ప్రొటీన్లు నిండిన ఆహార పదార్థాలను రోజువారీ డైట్‌లో చేర్చుకోవాలని చెబుతున్నారు నిపుణులు.**





**నట్స్**

ప్రొటీన్లతో నిండిన బాదంపప్పు, పిస్తా, అక్రోట్.. వంటి గింజలను ప్రతిరోజూ మితంగా తీసుకోవడం మంచిది. అవి గుండెకు మేలు చేస్తాయట. సలాడ్లు, ఉడికించిన కూరగాయలతో కూడా వీటిని కలుపుకొని తినొచ్చు. అయితే నట్స్‌లో క్యాలరీలు కూడా ఎక్కువగానే ఉంటాయి కాబట్టి మితంగానే తీసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.



**పాలు, పాల పదార్థాలు**

కండరాల నిర్మాణానికి తోడ్పడే ప్రొటీన్లు పాలు, పాల పదార్థాల్లో పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తపోటు అదుపులో ఉంచడానికీ తోడ్పడతాయట. ఈ క్రమంలో తక్కువ కొవ్వులుండే పాల పదార్థాలను తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు.

**సోయాబీన్స్**

సోయాబీన్స్‌లో ప్రొటీన్ల మోతాదు ఎక్కువ. వీటిని సోయా పాలు, సోయా పేస్ట్, టోఫూ రూపంలోనూ తీసుకోవచ్చు. అయితే ఇవి కొంతమందికి పడకపోవచ్చు. అలాంటి వారు వీటిని తీసుకునే విషయంలో వైద్యులను సంప్రదించాలి.

**ఇవి కూడా!**

* బఠాణీలు, రాజ్మా, బీన్స్, చిక్కుళ్లు, ఇతర కూరగాయల్లోనూ ప్రొటీన్ ఉంటుంది.
* చేపల్లో ప్రొటీన్లతో పాటు గుండెకు మేలు చేసే ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలూ ఎక్కువగానే ఉంటాయి.
* మాంసాహారంలోనూ ప్రొటీన్లు మెండుగా ఉంటాయి. అయితే వీటిలో కొవ్వులు కూడా ఎక్కువగా ఉంటాయి కాబట్టి మితంగానే తీసుకోవాలంటున్నారు నిపుణులు.
* కోడిగుడ్డులో కూడా ప్రొటీన్ ఉంటుంది. కానీ కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్న వారు, గుండెజబ్బులు.. వంటి సమస్యలున్న వారు డాక్టర్ సలహా తీసుకున్న తర్వాతే వీటిని ఆహారంలో చేర్చుకోవాలి.

# పోషకాల ఖర్జూరాలు.. అందుకే ఎంతో మేలు!

**రంజాన్ మాసంలో ఆచరించే కఠిన ఉపవాస దీక్షకు అత్యంత ప్రాధాన్యం ఉంది. రోజా ఈ దీక్ష విరమించేటప్పుడు తీసుకునే ఆహార పదార్థాల్లో 'ఖర్జూరాలు' తప్పకుండా ఉంటాయి. శరీరానికి తక్షణ శక్తినిచ్చే ఈ పండు ఆరోగ్యపరంగానూ ఎంతో మేలు చేస్తుందంటున్నారు నిపుణులు.**

* పొటాషియం ఎక్కువగా లభించే ఖర్జూరాలు తినడం వల్ల గుండె కొట్టుకునే రేటు, రక్తపోటు అదుపులో ఉంటాయట. అలాగే గుండె సంబంధిత సమస్యలు దరిచేరకుండా జాగ్రత్తపడచ్చని చెబుతున్నారు నిపుణులు.
* ఖర్జూరం పండ్లలో శరీరానికి కావాల్సిన ఖనిజాలు, విటమిన్లు, ఇతర పోషకాలు అధికంగా ఉంటాయట. ఇవి సంపూర్ణ ఆరోగ్యానికి చాలా అవసరం.
* ఖర్జూరాల్లో కొలెస్ట్రాల్ తక్కువగా.. ఫైబర్ ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఇవి తింటే ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్న భావన కలిగి.. బరువు అదుపులో ఉంచుకోవచ్చు.
* క్యాల్షియం, మెగ్నీషియం, కాపర్.. వంటి ఖనిజాలు ఈ పండులో అధికంగా లభిస్తాయి. క్యాల్షియం ఎముకలను, దంతాలను దృఢంగా ఉంచడానికి.. కాపర్ ఎర్రరక్తకణాల ఉత్పత్తికి.. మెగ్నీషియం ఎముకల ఆరోగ్యానికి ఉపయోగపడతాయి.
* ఖర్జూరాలు కేవలం బరువు తగ్గడానికి మాత్రమే కాదు.. బాగా సన్నగా ఉండి బరువు పెరగాలనుకునే వారికీ మంచి ఫలితాన్నిస్తాయంటున్నారు నిపుణులు.
* ఖర్జూరం పండు శరీరానికి తక్షణ శక్తినిస్తుంది. అందుకే రంజాన్ ఉపవాస దీక్షల సమయంలో ఈ పండుని ఆహారంగా తీసుకుంటారు.
* మలబద్ధకంతో బాధపడేవారు కొన్ని ఖర్జూరాల్ని రాత్రంతా నీటిలో నానబెట్టి ఉదయాన్నే పరగడుపున వాటిని తిని, ఆ నీరు తాగితే మంచి ఫలితం ఉంటుందట.
* ఖర్జూరంలో ఉండే వివిధ పోషకాలు శరీరంలోని జీవక్రియలను వేగవంతం చేయడంలో సహకరిస్తాయి.
* ఖర్జూరాల్లో ఉండే విటమిన్ 'బి6' వల్ల మెదడు చురుగ్గా పనిచేస్తుందట.
* శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలోనూ ఖర్జూరాలు తమ వంతు పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు నిపుణులు.






# అవును నిజమే

**హీరోయిన్ సమంత తల్లి కాబోతున్నట్లు గత కొద్ది రోజులుగా టాలీవుడ్‌లో పుకార్లు షికారు చేస్తున్నాయి. ఇటీవల జరిగిన మా ఇంటి బంగారం సక్సెస్ సెలబ్రేషన్స్‌లో సమంత బేబీ బంప్‌తో కనిపించిన ఫొటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. అయితే ఈ ప్రెగ్నెన్సీ వార్తలపై సమంతతో పాటు ఆమె భర్త రాజ్ నిడిమోరు మాత్రం రియాక్ట్ కాలేదు.**

తాజాగా సమంత తల్లి కాబోతున్న విషయాన్ని మెగాస్టార్ చిరంజీవి బయటపెట్టారు. మా ఇంటి బంగారం విజయాన్ని పురస్కరించుకొని చిత్రబృందాన్ని చిరంజీవి అభినందించారు. ఇటీవలే మా ఇంటి బంగారం సినిమాను చూసి ఇంప్రెస్ అయిన మెగాస్టార్ ....సమంత, రాజ్ నిడిమోరుతో పాటు దర్శకురాలు నందిని రెడ్డిలను తన నివాసానికి ఆహ్వానించారు. టీమ్‌తో చాలా సేపు ముచ్చటించారు. వారిపై ప్రశంసలు కురిపించారు.

**కొత్త అధ్యాయాన్ని....**

అంతే కాకుండా సమంత తల్లి కాబోతున్న సంగతిని చిరంజీవి బయటపెట్టారు. "జీవితంలో కొత్త అధ్యాయాన్ని ఆహ్వానిస్తున్న సమంత, రాజ్ దంపతులకు ప్రత్యేక శుభాకాంక్షలు" అంటూ తన పోస్ట్‌లో చిరంజీవి పేర్కొన్నారు. సమంత,రాజ్ ప్రెగ్నెన్సీ న్యూస్‌ను త్వరలో అభిమానులతో ప్రత్యేకంగా పంచుకోవాలని అనుకున్నారట. కానీ వారి కంటే ముందే మెగాస్టార్ లీక్ చేసేశారు. సమంతకు అభిమానులు కంగ్రాట్స్ చెబుతున్నారు. మరోవైపు చిరంజీవి ట్వీట్ వైరల్ అవుతోంది.



# ప్రియదర్శి ఇడుపు కాయిదం

**ప్రియదర్శి హీరోగా స్టార్ డైరెక్టర్ సుకుమార్ నిర్మాణంలో తెలుగులో ఓ కాన్సెప్ట్ ఓరియెంటెడ్ మూవీ రాబోతుంది. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమాతో వంశీరెడ్డి డైరెక్టర్‌గా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. ఫోక్ సింగర్ కమ్ డ్యాన్సర్ నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిన్న సినిమాను బన్నీవాస్‌తో కలిసి సుకుమార్ ప్రొడ్యూస్ చేయబోతున్నారు.**

**తెలంగాణ యాస...భాషలతో...**

కాగా సుకుమార్, ప్రియదర్శి సినిమాకు ఇడుపు కాయిదం అనే టైటిల్‌ను మేకర్స్ కన్ఫామ్ చేసినట్లు సమాచారం. టైటిల్ చూస్తుంటే విడాకుల నేపథ్యంలో ఈ సినిమా సాగనున్నట్లు కనిపిస్తోంది. కంప్లీట్ తెలంగాణ యాస, భాషలతో పాటు ఇక్కడి సంస్కృతికి ప్రాధాన్యమిస్తూ సినిమా రూపొందుతోన్నట్లు సమాచారం. గురువారం అఫీషియల్‌గా లాంఛ్ కానుంది.

**అప్పుడు కమెడియన్...**

సుకుమార్ బ్యానర్‌లో గతంలో వచ్చిన దర్శకుడుతో పాటు మరికొన్ని సినిమాల్లో ప్రియదర్శి కమెడియన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కనిపించాడు. ఇప్పుడు అదే బ్యానర్‌లో హీరోగా సినిమా చేయబోతుండటం ఆసక్తికరంగా మారింది.

బలగం తర్వాత హీరోగా ప్రియదర్శి చాలానే సినిమాలు చేశాడు. కానీ ఇవేవీ అతడికి విజయాలను తెచ్చిపెట్టలేకపోయాయి. సుకుమార్ సినిమాతోనైనా ప్రియదర్శి సక్సెస్ బాట పడతాడో? లేదో? అన్నది ఆసక్తికరంగా మారింది. సేవ్ ది టైగర్స్ 3 వెబ్‌సిరీస్‌తో ఇటీవలే ప్రేక్షకులను పలకరించాడు ప్రియదర్శి. ఈ కామెడీ సిరీస్‌లో ప్రియదర్శితో పాటు అభినవ్ గోమఠం, చైతన్య కృష్ణ కీలక పాత్రల్లో నటించాడు. జియో హాట్‌స్టార్‌లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ అవుతోంది.





# కన్నీళ్లు పెట్టుకున్న మృణాల్ ఠాకూర్

సీతారామం బ్యూటీ మృణాల్ ఠాకూర్ సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టింది. తన కలనిజమైందంటూ కన్నీళ్లు పెట్టుకుంది. మృణాల్ సోదరుడు మందార్ ఠాకూర్ విదేశాల్లో ఉన్నత విద్యను పూర్తిచేసుకున్నాడు. సోదరుడి గ్రాడ్యుయేషన్ వేడుకల్లో మృణాల్ ఠాకూర్ పాల్గొన్నది. ఈ వేడుక తాలూకు వీడియోను అభిమానులతో పంచుకుంది. "నాకున్న అతి పెద్ద కలల్లో ఒకటి నిజమైంది. జీవితంలోనే అత్యంత ఆనందమైన క్షణాలివి. ఈ గ్రాడ్యుయేషన్ సెలబ్రేషన్స్ చూస్తుంటే నువ్వో హీరోలా... నీ సినిమాలో నేను చిన్న పాత్రలో భాగమైన అనుభూతి కలుగుతోంది. " అంటూ పోస్ట్ పెట్టింది. తమ్ముడి డిగ్రీ పట్టాతో ఫొటోలకు ఫోజులిచ్చిన మృణాల్ ఠాకూర్ ఎమోషనల్ అయ్యింది. కన్నీళ్లు పెట్టుకుంది.

# ఐపీఎస్ ఆఫీసర్ భార్యగా తమన్నా

యంగ్ హీరోయిన్ల పోటీని తట్టుకుంటూ దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ క్రేజీ ఆఫర్లను సొంతం చేసుకుంటోంది మిల్కీ బ్యూటీ తమన్నా. ప్రస్తుతం ఆరు సినిమాలను లైన్‌లో పెట్టింది. తన అప్‌కమింగ్ మూవీస్ వివరాలను ఫోర్బ్స్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తమన్నా రివీల్ చేసింది. అందులో రెండు బయోపిక్ సినిమాలు కూడా ఉన్నాయని చెప్పింది. లెజెండరీ ఫిల్మ్ మేకర్ వీ శాంతారం జీవిత కథతో రానున్న సినిమాలో తమన్నా హీరోయిన్‌గా కనిపించబోతున్నది. దీనితో పాటు మరో బయోపిక్ మూవీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు ప్రకటించింది. ఈ సినిమా టైటిల్‌ను తమన్నా రివీల్ చేసింది. ముంబై మాజీ పోలీస్ కమిషనర్ రాకేష్ మారియా జీవితం ఆధారంగా బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ రోహిత్ శెట్టి ఓ సినిమా తెరకెక్కిస్తోన్నాడు. ఈ బయోపిక్‌లో జాన్ అబ్రహం టైటిల్ పాత్రలో కనిపించబోతున్నాడు.



# డీ గ్లామర్ పాత్రలో..

సింగ్ గీతం సినిమాతో టాలీవుడ్‌లోకి రీఎంట్రీ ఇచ్చింది నివేదా పేతురాజ్. కల్కి డైరెక్టర్ నాగ్ అశ్విన్ నిర్మించిన ఈ సినిమాలో స్పెషల్ రోల్‌లో కనిపించి సర్‌ప్రైజ్ చేసింది. మెగాస్టార్ చిరంజీవి, బాబీ డైరెక్షన్‌లో రూపొందుతోన్న సినిమాకు నివేదా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ సినిమా షూటింగ్‌లోనూ అడుగుపెట్టింది. తాజాగా టాలీవుడ్‌లో ఈ తమిళ బ్యూటీ మరో బంపరాఫర్ అందుకున్నట్లు సమాచారం. రామ్ పోతినేని సినిమాలో ఛాన్స్ దక్కించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. రామ్ పోతినేని దర్శకుడిగా ఎంట్రీ ఇస్తూ ఓ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీని రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో అతడే హీరోగా కనిపించబోతున్నాడు. ప్రస్తుతం రామ్ డైరెక్షనల్ డెబ్యూ మూవీ ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా సాగుతోన్నాయి. రామ్ తమ్ముడు కృష్ణ చైతన్య ఈ పాన్ ఇండియన్ సినిమాను నిర్మిస్తున్నారు. కథానుగుణంగా ఈ సినిమాలో ఇద్దరూ హీరోయిన్లు ఉంటారని టాక్. ఓ హీరోయిన్‌గా నివేదా పేతురాజ్‌ను ఫైనల్ చేశారట. డీ గ్లామర్ పాత్రలో నివేదా కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.